RNI NO : TELTEL/2023/89146

Telugu Daily

# శేనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగుదినపత్రిక సంపుటి :3 సంచిక:217 ఆదివారం 12 సెప్టెంబర్ 2026 పేజీలు :8 వెల రూ.5

Published from : Karimnagar Circulated to : Adilabad, Warangal, Hyderabad, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad, Rangareddy

రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి

శేనార్తి మీడియా

ఆహ్వానం పలుకుతుంది

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేసేందుకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లలో సంప్రదించగలరు.

77309 83966 98491 98098

## ఢిల్లీ డిక్లరేషన్‌కు ఏకాభిప్రాయ ఆమోదం



- అరబ్ దేశాల మధ్య విభేదాలకు తెర
- భారత్ దౌత్యంతో చివరి నిమిషంలో సయోధ్య
- యూఎన్ భద్రతా మండలిలో భారత్‌కు పెద్ద పాత్ర
- స్థానిక కరెన్సీలతో వాణిజ్యానికి ప్రాధాన్యం
- పహల్గాం ఉగ్రదాడిని ఖండించిన బ్రిక్స్
- స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్ ఏర్పాటుకు నిర్ణయం


4

## ఢిల్లీలో మోదీ–జిన్‌పింగ్ భేటీ



- దీర్ఘకాలిక వ్యూహాత్మక ఒప్పందాలకు చైనా సిద్ధం
- భారత్‌తో కలిసి నడవాలి: జిన్‌పింగ్
- ఉమ్మడి అభివృద్ధికి పరస్పర సహకారం
- నిర్మాణాత్మక చర్చలకు భారత్ సిద్ధం: మోదీ
- ఏడేళ్ల తర్వాత భారత్‌కు జిన్‌పింగ్

4



## వేలాడుతున్న విస్తరణ కత్తి

- ముందు బుజ్జగింపులు.. ఆ తర్వాతే ఖాళీల భర్తీ
- మూడు పదవులు..
- చాంతాడంత పోటీ సామాజిక, ప్రాంతీయ సమీకరణాలపై కసరత్తు
- రెడ్డి వర్గం సీనియర్లకు పదవులపై ఆశలు
- బీసీ, ఎస్సీ, లంబాడా వర్గాల నుంచి డిమాండ్లు
- స్థానిక సంస్థల ఎన్నికల వేళ అసమ్మతిపై ఆందోళన
- నామినేటెడ్ పోస్టులతో అసంతృప్తిని చల్లార్చే యోచన

2

# అధికారం పోయింది.. అహంకారం పోలేదు

- ప్రతిపక్షాలపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు
- ప్రజల తీర్పును గౌరవించాలంటూ హితవు
- రాజకీయ ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచన
- 'వేపాకులతో కొడతారు' అంటూ చమత్కారం
- పోలేపల్లి జాతర ప్రస్తావనతో సభలో నవ్వులు
- అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య పలుమార్లు వాగ్వాదం


**హైదరాబాద్, సెప్టెంబర్ 12:**

శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపక్షాలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి. అధికారం కోల్పోయినా అహంకారం మాత్రం పోలేదంటూ ఆయన విమర్శించారు. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం కొనసాగుతున్న సమయంలో ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రజల తీర్పును గౌరవిస్తూ ఇప్పటికైనా ఆత్మపరిశీలన చేసుకోవాలని ప్రతిపక్షాలకు సూచించారు.

**అహంకారం వదులుకోవాలంటూ**

అధికారం పోయింది.. కానీ అహంకారం పోలేదంటూ ప్రతిపక్షాలను ఉద్దేశించి సీఎం వ్యాఖ్యానించారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాలని, రాజకీయంగా ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇప్పటికైనా అహంకార ధోరణిని వీడాలని సూచించారు.

మిగతా 2వ పేజీలో..



## క్యూర్ బిల్లుకు మండలి ఆమోదం

- కోర్ అర్బన్ రీజియన్ 2026 బిల్లుకు గ్రీన్‌సిగ్నల్
- హైదరాబాద్ అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వ నిర్ణయం
- 'ఒకే నగరం.. ఒకే పరిపాలన.. ఒకే చట్టం' నినాదం

2

## మండపాలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం

- అతిథులను ఆహ్వానిస్తే కమిషనరేట్‌కు సమాచారం ఇవ్వండి
- పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలి
- గణేష్ ఉత్సవాలపై సీఎం సమీక్ష

3



### నిమ్స్ వైద్యులకు సీఎం అభినందనలు

3



## ఆదిలాబాద్ విమానాశ్రయంపై మరో ముందడుగు

- జేయూఏతో రక్షణ సామర్థ్యాలు మరింత బలోపేతం
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సమక్షంలో సమీక్ష
- డీపీఆర్, మాస్టర్ ప్లాన్‌ను వేగవంతం చేయాలని నిర్ణయం
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

2

## రాష్ట్రంలో మూడు రోజులు వర్షా లు

- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 :**

రాష్ట్రంలో వర్షాలు కొనసాగుతున్నాయని, పలు జిల్లాల్లో మరో వారం రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటూ హెచ్చరికలు జారీచేసింది. ముఖ్యంగా ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయని వాతావరణ కేంద్రం తెలిపింది. వీటితోపాటు నల్గొండ, నాగర్ కర్నూల్, మహబూబ్నగర్, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నది. హైదరాబాద్ నగరంలోనూ మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నాయని తెలిపింది.





## తక్షణమే యూఎన్ఎస్సీ సంస్కరణలు

- ఆలస్యం ఇక ఎంతమాత్రం వద్దు: మోదీ
- నిబంధనలు పాటించేవారిగా కాదు.. రూపొందించేవారిగా మారాలి
- గ్లోబల్ సౌత్‌కు నిర్ణయాధికారం దక్కాలి
- అధికార పిరమిడ్‌ను మార్చాలి
- ఏఐ, సైబర్, బయోటెక్‌లో సహకారం పెంచాలి

4

## 22Aపై చర్చలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు

- మంత్రి పొంగులేటి అబద్ధాల ప్రవాహం
- ప్రతిపక్షానికి మైక్ ఇవ్వకుండా సస్పెన్షన్
- తాము అడిగిన ప్రశ్నలకు సమాధానాలేవీ లేవు
- మా మామ భూమిపై అర్ధసత్యాలు చెప్పారు
- రూ.15 కోట్ల విలువంటే.. రూ.50 లక్షలకే తీసుకోండి

2





## మాక్ అసెంబ్లీలో తలసాని సెటైర్లు

- తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వినూత్న నిరసన
- సీఎం పాత్రలో తలసాని శ్రీనివాస్ యాదవ్
- స్పీకర్‌గా మాణిక్‌రావు ప్రభుత్వ విధానాలపై వ్యంగ్యాస్త్రాలు
- సస్పెన్షన్లపై చురకలు
- ప్రతిపక్ష గొంతు నొక్కుతున్నారంటూ విమర్శలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 12:**

కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుకు, అసెంబ్లీలో ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారనే ఆరోపణలకు నిరసనగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు శనివారం

మిగతా 2వ పేజీలో..




# క్యూర్ బిల్లుకు మండలి ఆమోదం

- **కోర్ అర్బన్ రీజియన్ 2026 బిల్లుకు గ్రీన్‌సిగ్నల్**
- **హైదరాబాద్ అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వ నిర్ణయం**
- **'ఒకే నగరం.. ఒకే పరిపాలన.. ఒకే చట్టం' నినాదం**
- **మండలిలో మొత్తం నాలుగు బిల్లులకు ఆమోదం**
- **ఆరు రోజుల పాటు కొనసాగిన శాసనమండలి సమావేశాలు**
- **19 గంటల 20 నిమిషాల పాటు మండలి కార్యకలాపాలు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 12:**

హైదరాబాద్ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తీసుకొచ్చిన క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్) 2026 బిల్లుకు తెలంగాణ శాసనమండలి ఆమోదం తెలిపింది. శనివారం మండలిలో బిల్లును ప్రవేశపెట్టగా.. సభ్యులు చర్చించిన అనంతరం ఆమోదించారు. అనంతరం శాసనమండలి నిరవధికంగా వాయిదా పడింది.

**ఒకే పరిపాలన.. ఒకే చట్టం**

హైదరాబాద్ నగర అభివృద్ధి, పరిపాలనను మరింత సమర్థంగా నిర్వహించాలనే ఉద్దేశంతో క్యూర్ 2026 బిల్లును ప్రభుత్వం రూపొందించింది. 'ఒకే నగరం.. ఒకే పరిపాలన.. ఒకే చట్టం' అనే విధానంతో బిల్లుకు రూపకల్పన చేసినట్లు ప్రభుత్వం తెలిపింది.

**నాలుగు బిల్లులకు ఆమోదం**

శనివారం జరిగిన మండలి సమావేశంలో క్యూర్ బిల్లుతోపాటు మొత్తం నాలుగు బిల్లులకు సభ్యులు ఆమోదం తెలిపారు. వివిధ అంశాలపై చర్చించిన అనంతరం బిల్లులకు మండలి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేశారు.

**ఆరు రోజులు.. 19 గంటల 20 నిమిషాలు**

తెలంగాణ శాసనమండలి మొత్తం ఆరు రోజుల పాటు కార్యకలాపాలు నిర్వహించింది. ఈ కాలంలో 19 గంటల 20 నిమిషాల పాటు సభ కొనసాగినట్లు ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది.

# మాక్ అసెంబ్లీలో తలసాని సెటైర్లు

**మొదటిపేజీ తరువాయి**

తెలంగాణ భవన్‌లో మాక్ అసెంబ్లీ నిర్వహించారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాత్ర పోషించగా.. ఎమ్మెల్యే మాణిక్‌రావు స్పీకర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు, మంత్రుల వ్యాఖ్యలపై తలసాని సీఎం పాత్రలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

**సస్పెన్షన్లపై చురకలు**

మాక్ అసెంబ్లీలో తలసాని మాట్లాడుతూ.. "కొండా సురేఖ బిడ్డ నా గురించి మాట్లాడింది కాబట్టే ఢిల్లీకి వెళ్లి మూడు రోజులు ఉండి తొక్కి వచ్చాను. ముఖ్యమంత్రినైన నన్ను, అదీ ఓ బీసీ బిడ్డను బర్తరఫ్ చేయక ఏం చేయాలి? కేబినెట్‌లో వేరే వాళ్లు కూడా ఉన్నారుగా.. కొండా సురేఖ బిడ్డ వాళ్ల గురించి కూడా మాట్లాడొచ్చుగా" అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

**ప్రతిపక్షాల ప్రశ్నలపై వ్యంగ్యం**

బీఆర్ఎస్ మహిళా నేతలను ఉద్దేశించి తలసాని మాట్లాడుతూ.. "సబితక్క, సునీతక్క అంటే నాకు ఎంతో గౌరవం. కానీ, మీరు ఇవన్నీ సభలో ప్రశ్నిస్తారనే ఉద్దేశంతోనే మిమ్మల్ని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేశాను" అంటూ సటైరికల్‌గా వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యలను లేవనెత్తకుండా ప్రతిపక్ష సభ్యులపై సస్పెన్షన్ వేటు వేస్తూ మంత్రులు తమ బాధ్యతల నుంచి తప్పించుకుంటున్నారని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు.

**ప్రజల పక్షాన ప్రశ్నిస్తాం**

అసెంబ్లీని ఏకపక్షంగా నడిపిస్తున్నారని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఆరోపించారు. ప్రజల తరపున ప్రశ్నించే గొంతుకలను భయపెట్టలేరని స్పష్టం చేశారు. ప్రభుత్వ తీరును ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకే మాక్ అసెంబ్లీ నిర్వహించినట్లు తెలిపారు.

# మాక్ అసెంబ్లీ.. డెమోక్రసీని మాక్ చేయడమే

- **పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క**



**హైదరాబాద్, సెప్టెంబర్ 12 :**

బీఆర్ఎస్ నిర్వహించిన మాక్ అసెంబ్లీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ఉందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క విమర్శించారు. చట్టసభల పట్ల, ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల ఆ పార్టీకి ఏ మాత్రం గౌరవం లేదనేది వారి చర్యలతో మరోసారి స్పష్టమైందన్నారు. అసెంబ్లీ లాబీలో మంత్రి సీతక్క శనివారం చిట్ చాట్ చేశారు. ఎర్రవల్లిలో ఎల్పీ సమావేశం నిర్వహించిన బీఆర్ఎస్ నేతలు పార్టీ కార్యాలయంలో మాక్ అసెంబ్లీ నిర్వహించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. అసెంబ్లీకి రావాల్సిన నేతలు పార్టీ కార్యాలయంలో కూర్చుని అసెంబ్లీని అనుకరించడం ప్రజాస్వామ్యాన్ని గౌరవించడమా అని నిలదీశారు. గతంలో ఫామ్‌హౌస్ ముందు దళిత సంఘాలు నిరసన తెలిపినప్పుడు పసుపు నీళ్లతో ఆ ప్రాంతాన్ని శుద్ధి చేసిన ఘటనను మంత్రి సీతక్క గుర్తు చేశారు. ఇంకా ఆ మైల పోలేదనే ఆధిపత్య దురహంకారంతోనే ఫామ్‌హౌస్‌లో మాక్ అసెంబ్లీ నిర్వహించలేదా అని ప్రశ్నించారు. అసెంబ్లీకి ఎలాగూ రాని కేసీఆర్ బీఆర్ఎస్ నిర్వహించిన మాక్ అసెంబ్లీకి కూడా రాకపోవడం చూస్తుంటే ఆయనకు చట్టసభల పట్ల, సొంత పార్టీ కార్యక్రమాల పట్ల ఎంత గౌరవం ఉందో అర్థమవుతోందని సీతక్క అన్నారు. కేసీఆర్ అధికారంలో ఉంటే సచివాలయానికి రారు.. ప్రతిపక్షంలో ఉంటే అసెంబ్లీకి రారు అని ఆమె ఎద్దేవా చేశారు. ఫామ్‌హౌస్‌ను సచివాలయంగా, పార్టీ కార్యాలయాన్ని అసెంబ్లీగా భావించే పార్టీ బీఆర్ఎస్ తప్ప దేశంలో మరొకటి లేదని విమర్శించారు. ఫామ్‌హౌస్‌లో ఎల్పీ సమావేశం.. పార్టీ కార్యాలయంలో అసెంబ్లీ సమావేశం.. ఉన్న దగ్గరకే అన్నీ రావాలనుకోవడం దొరల అహంకారానికి నిదర్శనం.. చింత చచ్చినా పులుపు చావలేదన్నట్లు అధికారం పోయినా దొర అహంకారం మాత్రం ఇంకా పోలేదు అని సీతక్క మండిపడ్డారు. ప్రజలు ఎన్నుకున్న అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించాల్సిన బాధ్యత ప్రతిపక్ష పార్టీకి ఉందన్నారు. స్పీకర్‌ను, చట్టసభలను అవమానిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న బీఆర్ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని, ప్రతిపక్ష హోదాను ఊడగొట్టడం ఖాయమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

## అధికారం పోయింది..
# అహంకారం పోలేదు

**మొదటిపేజీ తరువాయి**

**సభలో రేవంత్ చమత్కారం**

చర్చ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి తనదైన శైలిలో చేసిన వ్యాఖ్యలు సభలో నవ్వులు పూయించాయి. ''మన ఊర్లలో అయితే వేపాకులతో కొడతారు అధ్యక్షా'' అంటూ చమత్కరించారు. అనంతరం పోలేపల్లి జాతరకు తీసుకెళ్లి కొట్టాలా? అని సరదాగా వ్యాఖ్యానించారు. అలాంటి పరిస్థితుల్లోనైనా జ్ఞానోదయం కలుగుతుందేమో అంటూ వ్యాఖ్యానించడంతో సభలో నవ్వులు వెల్లువెత్తాయి. అధికార పక్ష సభ్యులు ఈ వ్యాఖ్యలను హర్షించారు.

**వాగ్వాదాల మధ్య వ్యాఖ్యలు**

శాసనసభలో జరిగిన చర్చ సందర్భంగా అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య పలుమార్లు వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు సభలో ప్రత్యేక చర్చకు దారితీశాయి. ప్రజల తీర్పు, తాజా రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై అధికార పక్షం సమర్థన వ్యక్తం చేస్తుండగా.. ప్రతిపక్షాలు తమదైన రీతిలో స్పందిస్తున్నాయి. దీంతో అసెంబ్లీ సమావేశాల్లో సీఎం వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు కారణమయ్యాయి.

# వేలాడుతున్న విస్తరణ కత్తి

**హైదరాబాద్, సెప్టెంబర్ 12:**

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న మంత్రివర్గ విస్తరణ వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. క్రమశిక్షణా రాహిత్యం ఆరోపణలతో కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించడంతో, ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఖాళీగా ఉన్న రెండు స్థానాలకు అదనంగా మరో పదవి ఖాళీ అయింది. దీంతో మొత్తం మూడు మంత్రి పదవులను భర్తీ చేయాల్సి ఉంది. అయితే ఈ పదవుల కోసం ఆశావహుల పోటీ, సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ ప్రాతినిధ్య డిమాండ్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కొత్త సవాళ్లు విసురుతున్నాయి. ఎవరికి అవకాశం కల్పించినా మరికొందరిలో అసంతృప్తి రేగే ప్రమాదం ఉండటంతో, విస్తరణకు ముందే ఆశావహులను బుజ్జగించడంపై కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి సారించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**రెడ్డి వర్గం సీనియర్లకు ఆశలు**

మంత్రివర్గంలో చోటు కోసం కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి వంటి సీనియర్ నేతలు ప్రయత్నిస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ముఖ్యమంత్రితో సహా ఇప్పటికే కేబినెట్‌లో రెడ్డి సామాజిక వర్గానికి గణనీయమైన ప్రాతినిధ్యం ఉంది. ఈ నేపథ్యంలో మిగిలిన మూడు స్థానాల్లోనూ అదే వర్గానికి అవకాశం కల్పిస్తే బీసీ, ఎస్టీ, లంబాడా వర్గాల్లో అసంతృప్తి పెరిగే ప్రమాదం ఉంది. మరోవైపు సీనియర్ రెడ్డి నేతలను పక్కనపెడితే, వారు నేరుగా సీఎం రేవంత్ రెడ్డినే లక్ష్యంగా చేసుకుని అసమ్మతి వ్యక్తం చేసే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

**ప్రాంతీయ సమీకరణాలూ కీలకమే**

ఉమ్మడి నిజామాబాద్, హైదరాబాద్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి ప్రస్తుతం మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేకపోవడంతో ఆయా ప్రాంతాల నేతలు పదవులను ఆశిస్తున్నారు. కొండా సురేఖ నిష్క్రమణతో బీసీ సామాజిక వర్గానికి చెందిన స్థానం ఖాళీ కావడం కూడా సామాజిక సమతుల్యతను కాపాడాల్సిన అవసరాన్ని పెంచింది. బీసీ కోటాలో ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య పేర్లు వినిపిస్తుండగా.. ఎస్టీ లంబాడా వర్గం నుంచి బాలు నాయక్, రామచంద్రు నాయక్ ఆశావహులుగా ఉన్నట్లు తెలుస్తోంది. మూడు పదవుల భర్తీలో సామాజిక, ప్రాంతీయ సమీకరణాలను సమన్వయం చేయడం అధిష్ఠానానికి సవాలుగా మారింది.

**ముందు బుజ్జగింపులపైనే దృష్టి**

రాబోయే స్థానిక సంస్థల, కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో పార్టీలో అంతర్గత విభేదాలు తలెత్తడం కాంగ్రెస్‌కు ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. పదవులు దక్కని సీనియర్లు బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేస్తే, ఆ పరిణామం బీఆర్ఎస్, బీజేపీలకు రాజకీయ ఆయుధంగా మారవచ్చు. దీంతో తొందరపడి విస్తరణ చేపట్టి కొత్త వివాదాలకు తెరతీయడం కంటే.. ముందుగా ఆశావహులను సముదాయించడంపైనే రేవంత్ దృష్టి సారించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు, ఇతర నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యం కల్పించడం ద్వారా అసంతృప్తిని చల్లార్చే ప్రయత్నాలు జరగవచ్చని భావిస్తున్నారు.

**ఆ తర్వాతే కేబినెట్ విస్తరణ**

ఆశావహుల అసంతృప్తిని కొంతమేర తగ్గించిన తర్వాతే మంత్రివర్గ విస్తరణపై ముందడుగు వేయాలని రేవంత్ భావించే అవకాశం ఉంది. హైకమాండ్ ఆమోదం లభించినా, పదవులు దక్కని నేతలను దారికి తీసుకురావడం, సామాజిక సమతుల్యతను కాపాడటం ఆయన నాయకత్వానికి పరీక్షగా నిలవనుంది. మూడు పదవుల కోసం పోటీ పడుతున్న ఆశావహులు అధిష్ఠానం సూచనలకు అనుగుణంగా వ్యవహరిస్తారా? లేక అసమ్మతి గళం వినిపిస్తారా? అన్నది ఇప్పుడు కాంగ్రెస్‌లో ఆసక్తికరంగా మారింది.

# ఆదిలాబాద్ విమానాశ్రయంపై మరో ముందడుగు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 :**

వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలకమైన ఆదిలాబాద్ ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి వేగంగా అడుగులు పడుతున్నాయి. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు సంబంధించి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడుతో తాను శనివారం సమావేశమైనట్లు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పురోగతిపై సమీక్ష నిర్వహించామన్నారు. ఎయిర్‌పోర్టు ప్రాజెక్టు అమలును వేగవంతం చేయడంతోపాటు ఈ కార్యాచరణను మరింత పకడ్బందీగా అమలు చేసేందుకు రక్షణ శాఖ, పౌరవిమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వం నుంచి ఒక్కో నోడల్ ఆఫీసర్‌ను వచ్చే వారంలోగా ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలిపారు. దీంతోపాటు జాయింట్ యూజర్ ఎయిర్‌పోర్ట్(జేయూఏ)కు సంబంధించిన డీపీఆర్, మాస్టర్ ప్లాన్ రూపకల్పనను వేగవంతం చేయాలని కూడా నిర్ణయించామన్నారు. ఈ ప్రాజెక్టు తెలంగాణ ప్రజలకు, ముఖ్యంగా ఉత్తర తెలంగాణ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని, ఆదిలాబాద్ విమానాశ్రయం కోసం ఏళ్లుగా చేస్తున్న ప్రయత్నాలు.. వరుస సమావేశాలు, లేఖలు, నిరంతర సమన్వయం.. ఇవాళ తుది దశకు చేరుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. ఉత్తర తెలంగాణ కనెక్టివిటీ విషయంలో దేశ రక్షణపరంగా వ్యూహాత్మక ప్రాంతమైన ఆదిలాబాద్‌లో విమానాశ్రయం ఏర్పాటు, ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ ఏర్పాటు అవసరాన్ని వివరిస్తూ రీజనల్ కనెక్టివిటీని మెరుగుపరచాల్సిన అంశాన్ని రాజ్‌నాథ్ సింగ్ దృష్టికి తీసుకెళ్లానన్నారు. దీనిపై స్పందించిన ఆయన ఆదిలాబాద్‌లో జేయ□ఏను అభివృద్ధి చేసేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ సిద్ధంగా ఉందని, ఇందుకు అవసరమైన సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని చెప్పారన్నారు. కాగా, ఈ ఎయిర్‌పోర్టుకు సంబంధించి రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల మధ్య పలు సమావేశాలు జరిగాయి. ఇందులో భాగంగా రక్షణ, పౌర విమానయాన అధికారులు ఏప్రిల్ 17న ఆదిలాబాద్ వియానాశ్రయ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంలో 2.75 కిలోమీటర్ల రన్ వే నిర్మాణం అవసరమని నిర్ణయించారు. దీంతోపాట□ ఐఏఎఫ్ వద్ద 369.45 ఎకరాల భూమికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించారు. ఇందులో ట్రైనర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, విజిటింగ్ ఎయిర్‌క్రాఫ్ట్ పార్కింగ్, వెదర్ షెల్టర్స్, ఎయిర్‌క్రాఫ్ట్ హ్యాంగర్స్, ఆపరేషనల్ కాంప్లెక్స్, ట్రైనింగ్ ఫెసిలిటీస్, మెయింటెనెన్స్ ఇన్‌ఫ్రా సదుపాయాలను కల్పిస్తామన్నారు. పౌర సేవలకు సంబంధించి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ (ఏఏఐ) ఒక సివిల్ టెర్మినల్‌తోపాటు మెయింటెనెన్స్ అండ్ రిపేర్ ఆపరేషన్స్ (ఎమ్మార్వో) సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తుంది. వీటితోపాటు ఎయిర్‌ఫోర్స్ సిబ్బందికి నివాస, ఇతర మౌలిక సదుపాయాలను కూడా ఏర్పాటు చేస్తారు.

# రాజీనామా చేయాల్సింది ఎవరు?

- **రూపాయి జీతంతో పేదల కోసం పనిచేస్తున్న నేనా..**
- **అసెంబ్లీకి రాకుండా ఫార్మ్ హౌస్‌లో ఉన్న కేసీఆరా**
- **పొంగులేటి.. పొంగు' అంటూ ఎందుకు భయపడుతున్నారు**
- **మాజీ మంత్రి హరీష్ రావును ప్రశ్నించిన మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 13 :**

ప్రతిపక్షాలు 22ఏ భూముల అంశాన్ని అడ్డుపెట్టుకుని చేస్తున్న రాజకీయ ఆరోపణలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీవ్రస్థాయిలో ఎక్స్ వేదికగా మండిపడ్డారు. ప్రజల భూ సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంటే అసత్య ప్రచారాలతో ప్రభుత్వాన్ని, తనను లక్ష్యంగా చేసుకోవడం ఎందుకని ప్రశ్నించారు. చీము, నెత్తురు, సిగ్గు, శరం ఉంటే రాజీనామా చేయాలని నన్ను అడుగుతున్నారు.. మరి ప్రజాధనంతో ఇన్నేళ్లు అధికారాన్ని అనుభవించి ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన వారు రాజీనామా చేయొద్దా అని మంత్రి నిలదీశారు. తాను ప్రతి నెలా ఒక్క రూపాయి జీతం మాత్రమే తీసుకుంటూ పేదల కోసం ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ టవర్స్ నిర్మాణంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తున్నానని తెలిపారు. 'ప్రజల కోసం పనిచేస్తున్న నన్ను రాజీనామా చేయమంటారా' అని ప్రశ్నించారు. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి రూ.21 కోట్లT పొంది అసెంబ్లీకి, ప్రజలకు మొఖం చాటేసిన కే.సీ.ఆర్ రాజీనామా చేయరా అని హరీష్ రావును ప్రశించారు.

**అధికారంలో ఉంటే అవినీతి.. ప్రతిపక్షంలో ఉంటే బ్లాక్‌మెయిల్**

'అధికారంలో ఉంటే అవినీతి.. ప్రతిపక్షంలో ఉంటే బ్లాక్‌మెయిల్. ఇప్పుడు చేస్తున్నది కూడా అదే. మీ బ్లాక్‌మెయిల్‌కు, తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రభుత్వం ఇది కాదు' అని స్పష్టం చేశారు. తన పేరును పదేపదే ప్రస్తావిస్తూ 'పొంగులేటి.. పొంగు' అంటూ ప్రతిపక్ష నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై మంత్రి ఘాటుగా స్పందించారు.' పొంగులేటి.. పొంగు అని ఎందుకు పదేపదే అంటున్నారు.. ఎందుకు అంత భయం.. శుభకార్యంలో పాలు పొంగితే శుభం. కానీ గోదావరి, కృష్ణా నదులు ఉగ్రరూపంలో పొంగితే ఆ పొంగులో మీరే కాదు.. మీ పార్టీ కూడా నామరూపాలు లేకుండా పోతుంది' అని వ్యాఖ్యానించారు



# 22Aపై చర్చలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు

**హైదరాబాద్, సెప్టెంబర్ 13:**

శాసనసభలో 22A నిబంధనలపై జరిగిన చర్చతో ప్రజలకు ఎలాంటి ఉపశమనం లభించలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. సభ సాక్షిగా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అబద్ధాల ప్రవాహాన్ని పారించారని మండిపడ్డారు. 22A అక్రమాలపై ప్రతిపక్షం నిలదీస్తుందనే భయంతోనే తమకు మైక్ ఇవ్వకుండా ఏకపక్షంగా సస్పెండ్ చేశారని ఆరోపించారు. తమను సభ నుంచి బయటకు పంపిన తర్వాత మంత్రి సుదీర్ఘ ప్రసంగంతో ఎదురుదాడికి దిగారే తప్ప, తాము లేవనెత్తిన ఏ ఒక్క ప్రశ్నకూ సమాధానం ఇవ్వలేకపోయారని అన్నారు.

**సభను పక్కదోవ పట్టించారు..**

**క్షమాపణ చెప్పలేదు**

22A జాబితా కారణంగా రాష్ట్రంలో ఎన్ని లక్షల మంది ప్రజల ఆస్తులు నిలిచిపోయాయో స్పష్టం చేయాలని తాము ప్రశ్నించినా ప్రభుత్వం సమాధానం దాటవేసిందని హరీశ్ రావు అన్నారు. అయితే, జాబితాను సక్రమంగా పరిశీలించకుండానే భూములను 22Aలో చేర్చామని మంత్రి చెప్పడం ద్వారా తప్పు జరిగిన విషయాన్ని సభలోనే అంగీకరించారని గుర్తు చేశారు. పొరపాటు జరిగిందని ఒప్పుకున్న మంత్రి ప్రజలకు క్షమాపణ చెప్పకపోగా తమపై ఎదురుదాడి చేయడం విచారకరమన్నారు. ముఖ్యమంత్రి ఇంటిని మాత్రం రాత్రికి రాత్రే 22A నిషేధిత జాబితా నుంచి తొలగించుకున్నారని, ఇదేనా ప్రజా ప్రభుత్వ పాలన అని ప్రశ్నించారు.

**మా మామ భూమిపై అవాస్తవాలు**

తమ కుటుంబ సభ్యుల భూములకు సంబంధించి మంత్రి పొంగులేటి సభలో అర్ధసత్యాలు మాట్లాడారని హరీశ్ రావు ఖండించారు. తన మామగారి భూమి గజ్వేల్ నియోజకవర్గంలో ఉంటే.. సిద్దిపేటలో ఉందంటూ మంత్రి తప్పుగా ప్రచారం చేశారని తెలిపారు. ఆ భూమికి 2010లోనే ఎన్‌ఓసీ వచ్చిందని, చెక్కుల ద్వారా చట్టబద్ధంగా లావాదేవీలు నిర్వహించి రిజిస్ట్రేషన్ చేసుకున్నామని స్పష్టం చేశారు.
ఎకరా రూ.15 కోట్ల విలువ అంటూ మంత్రి సభను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. నిజంగా అంత విలువ ఉంటే ఎకరాను రూ.50 లక్షలకే ఇస్తామని, మంత్రి పొంగులేటినే వచ్చి కొనుగోలు చేయాలని సవాల్ విసిరారు.

**తెలంగాణ ఉద్యమకారులను అవమానించడమే**

తనను 'అగ్గిపెట్టె రావు' అంటూ మంత్రి పొంగులేటి సంబోధించడంపై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, మంత్రి పొంగులేటికి తెలంగాణ ఉద్యమ చరిత్ర, దాని తీవ్రత ఏమాత్రం తెలియదని విమర్శించారు. తాము ఉద్యమం చేసిన రోజుల్లో భవిష్యత్తులో ఎమ్మెల్యేలు కావాలనే ఉద్దేశంతో పోరాటాలు చేయలేదని స్పష్టం చేశారు. ఉద్యమంలో భాగస్వాములైన వారిని, ఉద్యమకారులను ఇలాంటి వ్యాఖ్యలతో సంబోధించడం తెలంగాణ సమాజాన్ని, ఉద్యమ పోరాట స్ఫూర్తిని అవమానించడమేనని హరీశ్ రావు ధ్వజమెత్తారు.

# మండపాలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 :**

దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మండప నిర్వాహకులు సంబంధిత అధికారుల వద్ద దరఖాస్తు చేసుకుని ఉచిత విద్యుత్ పొందాలని సూచించారు. భాగ్యనగరంలో గణేశ్ ఉత్సవాల వేళ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఏ చిన్న ఇబ్బంది కలగకుండా సహాయ సహకారాలు అందించాలన్నారు. హైదరాబాద్‌లో గణేశ్ ఉత్సవాలపై శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్‌లో సీఎం రేవంత్ రెడ్డి శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత గత సంప్రదాయాన్ని పునరుద్ధరించామని, మీ సమస్యలు తెలుసుకునేందుకు స్వయంగా తానే సమీక్ష నిర్వహిస్తున్నానని చెప్పారు. మండపాలకు అతిథులను ఆహ్వానిస్తే నిర్వాహకులు ఆ వివరాలను స్థానిక కమిషనరేట్‌కు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. ఊహించని పరిణామాలు జరిగినపుడు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకునేందుకు ఆ సమాచారం ఉపయోగపడుతుందన్నారు. ఎక్కడెక్కడ మండపాలు ఏర్పాటు చేస్తున్నారో ముందుగానే సమాచారం అందిస్తే పోలీసులకు ట్రాఫిక్, బందోబస్తు నిర్వహణకు సులభంగా ఉంటుందని ఆయన చెప్పారు. అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మలకు ఏర్పాటు చేసినట్లే గణేశ్ నిమజ్జనాలకు అనుగుణంగా నిర్మాణ సమయంలోనే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చెరువుల వద్ద చుట్టూ క్రేన్స్ ఏర్పాటుకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఉత్సవాలు ముగిసే వరకు మున్సిపల్, పోలీస్ శాఖ నిరంతర పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసుకుని పర్యవేక్షణ, సమన్వయానికి ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు. హైదరాబాద్ ప్రశాంతంగా ఉంటేనే పెట్టుబడులు వస్తాయంటూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా జాగ్రత వహించాలన్నారు. ఇందుకు నిర్వాహకుల నుంచి సహకారం ఉండాలని కోరారు. సమస్యలు ఏమున్నా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉత్సవ సమితులకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేశ్, జీహెచఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ కమిషనర్లు, హైడ్రా కమిషనర్, పోలీసు ఉన్నతాధికారులు, అధికారులు, గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల్లో తీవ్ర అన్యాయం

- **మంత్రి సమాధానం తప్పుదారి పట్టించేలా ఉంది**
- **100 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి కేవలం 33 మందినే నియమించారు**
- **70 పోస్టులను జనరల్ కేటగిరీకి మార్చడంపై ఎమ్మెల్సీ పోచంపల్లి ఆగ్రహం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 :**

డీఎస్సీ (2024) ఉపాధ్యాయ నియామకాల్లో స్పోర్ట్స్ కోటా కింద ఉపాధ్యాయుల నియామకాపై మరోసారి తీవ్ర దుమారం రేగింది. ఈ అంశంపై శాసన మండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి అడిగిన ప్రశ్నకు క్రీడా శాఖ మంత్రి శ్రీహరి ఇచ్చిన సమాధానం తప్పుదారి పట్టించేలా ఉందని బాధితులు ఆరోపిస్తున్నారు. స్పోర్ట్స్ కోటాలో జరిగిన అవకతవకలు తన దృష్టికి రాలేదంటూ మంత్రి తప్పించుకునే యత్నం చేయడంపై జాతీయ క్రీడాకారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 2024లో చేపట్టిన స్పోర్ట్స్ కోటాలో టీచర్ల నియామకల్లో తప్పులు దొర్లాయని, వాటిని సరి చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. క్రీడాకారుల కోసం ఎంతో చేస్తున్నామని, అన్ని వసతులు కల్పిస్తున్నామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం.. బయట చెప్పేది ఒకటి.. ఆచరణలో మరొకటి చేస్తోందని శ్రీనివాస రెడ్డి విమర్శించారు. 2024 డీఎస్సీ టీచర్ నియామకాల్లో స్పోర్ట్స్ కోటాలో 100 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత కేవలం 33 పోస్టులను మాత్రమే భర్తీ చేసి మిగిలిన పోస్టులను జనరల్‌కు మార్చారని సభ దృష్టికి తీసుకువచ్చారు. అంతేకాకుండా స్పోర్ట్స్ కోటా నియామకాల్లో జాతీయ క్రీడాకారులకు జరిగిన అన్యాయంపై ఆయన ప్రశ్నించారు. చాలామంది జాతీయ స్థాయి క్రీడాకారులకు ఉద్యోగాలు రాకుండా అర్హత లేని వారికి ఉద్యోగాలు ఇచ్చారని తెలిపారు. ఈ విషయంపై కోర్టుకు వెళ్లినవారికి ఇప్పటి వరకు న్యాయం చేయలేదని, కనీసం కోర్టుకు కూడా ప్రభుత్వం తరుపున కౌంటర్ అఫిడవిట్ ఇవ్వకపోవడం వల్ల జాతీయ క్రీడాకారులకు ఉద్యోగా లు రాకుండా పోతున్నాయని తెలిపారు.



జనరల్‌కు మార్చిన 70 పోస్టులను మళ్లీ స్పోర్ట్స్ కోటాలో నియమకాలు చేయాలని సభ దృష్టికి తీసుకొస్తే, క్రీడా శాఖ మంత్రి ఈ విషయం తన దృష్టికి రాలేదని ఎవరూ తనను కలిసి చెప్పలేదని తప్పుడు సమాచారం ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటాపై రీ వెరిఫికేషన్ పేరుతో కాలయాపన చేస్తున్నారని జాతీయ క్రీడాకారులందరూ 2025 సెప్టెంబర్‌లో క్రీడా శాఖ మంత్రిని కలిసి ఒక వినతిపత్రం ఇచ్చారు. రీవెరిఫికేషన్ త్వరగా పూర్తి చేసేందుకు అధికారులతో మాట్లాడుతానని క్రీడామంత్రి హామీ ఇచ్చారని బాధితులు చెబుతున్నారు. కానీ ఆ తర్వాత ఎన్నిసార్లు కలిసినా పరిశీలనలో ఉందంటూ దాటవేస్తున్నారని, ఇప్పటివరకు రీవెరిఫికేషన్ కు సంబంధించిన వివరాలను వెల్లడించకపోవడం వల్ల తమకు ఉద్యోగాలు రావడంలేదని జాతీయ క్రీడాకారులు ఆందోళన చెందుతున్నారు. పోచంపల్లి అడిగిన ప్రశ్నకు తప్పుదారి పట్టించేలా క్రీడ శాఖ మంత్రి కనీసం తమ దృష్టికి రాలేదని చెప్పడం సరికాదన్నారు. ఆయనను కలిసి వినతిపత్రం ఇచ్చిన ఫోటోలను బాధితులు మీడియాకు చూపించారు. ఇదే అంశంపై స్పోర్ట్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ గత ఆగస్టులో క్రీడాశాఖకు పంపిన లేఖను సైతం అభ్యర్థులు చూపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని జాతీయ స్థాయి క్రీడాకారులు వేడుకుంటున్నారు.

# ‘రీయింబర్స్‌మెంట్’పై దాటవేత తగదు

- **రూ.15 వేల కోట్ల బకాయిల విడుదల ఎప్పుడో ప్రకటించాలి**
- **జీవో 97తో పాలిటెక్నిక్ వ్యవస్థను నాశనం చేస్తున్నారు**
- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 :**

కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలపై కాలయాపన చేయకుండా స్పష్టమైన ప్రకటన చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం మాట్లాడుతూ బీఆరఎస్ ప్రభుత్వ హయాంలో బీజేపీ ఎందుకు ప్రశ్నించలేదని అనడం పూర్తి అవాస్తవమన్నారు. 2017 జనవరి 4న తాను శాసనమండలి సభ్యుడిగా ఉన్నప్పుడే ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, విద్యావ్యవస్థ దుస్థితిపై గళమెత్తిన అంశాలు అసెంబ్లీ, మండలి రికార్డుల్లో స్పష్టంగా ఉన్నాయని గుర్తు చేశారు.

**రూ.15 వేల కోట్లకు చేరిన బకాయిలు**

రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి తెలంగాణ వచ్చిన తర్వాత కూడా బకాయిల సమస్య కొనసాగుతూనే ఉందని రామచందర్ రావు పేర్కొన్నారు. బీఆరఎస్ తన పదేళ్ల పాలనలో మొదటి ఎనిమిదేళ్లు నిధులు ఇచ్చి చివరి రెండేళ్లలో దాదాపు రూ.5 వేల కోట్ల బకాయిలు పెండింగ్‌లో పెట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అసెంబ్లీలోనే బీఆరఎస్ నుంచి రూ.5,430 కోట్ల బకాయిలు వచ్చాయని చెప్పిందని, 202425 నాటికి కాంగ్రెస్ హయాంలోనే మరో రూ.6,037 కోట్ల బకాయిలు పెరిగాయని ప్రభుత్వమే వెల్లడించిందని వివరించారు. 2026 నాటికి పాత, కొత్త బకాయిలు అన్నీ కలిసి సుమారు రూ.15 వేల కోట్లకు చేరుకున్నాయని మండిపడ్డారు. విద్యార్థుల ఖాతాల్లోకే నేరుగా నగదు జమ చేసే డీబీటీ విధానానికి బీజేపీ ఏనాడూ వ్యతిరేకం కాదని, యాజమాన్యాలతో తమకు సంబంధం లేదని, విద్యార్థుల ఖాతాల్లో ఆ సొమ్మును ఎప్పుడు జమ చేస్తారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని నిలదీశారు. బకాయిలు చెల్లించకపోవడం వల్లే అనేక కాలేజీలు విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను నిలిపివేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత బీఆరఎస్ హయాంలో అక్రమాలు జరిగినా, కాంగ్రెస్ హయాంలో జరిగినా సమగ్ర విచారణ జరపాలని, విజిలెన్స్ దాడుల పేరుతో కాలేజీలను వేధించడం సరికాదని స్పష్టం చేశారు.

**విద్యాశాఖ నిర్వీర్యం.. పాలిటెక్నిక్ విద్యార్థులపై లాఠీచార్జి దుర్మార్గం**

సీఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖను తన వద్దే ఉంచుకుని విద్యావ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేశారని ఆరోపించారు. నూతన విద్యావిధానం తీసుకొస్తామని చెప్పి నియమించిన కమిటీ చైర్మనే రాజీనామా చేశారని, ఆ కమిటీ విద్యా సంస్కరణల కోసం కాక నక్సలిజం భావజాలం, నక్సలైట్లను తయారు చేసే దిశగా మారిందని మండిపడ్డారు. మరోవైపు పాలిటెక్నిక్ విద్యార్థుల జీవితాలను సర్కార్ అంధకారంలోకి నెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవో 97 ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్‌ను ఇంటిగ్రేట్ చేసి పాలిటెక్నిక్ డిగ్రీనే పూర్తిగా ఎత్తేసే కుట్ర జరుగుతోందని, వారికి ఈసెట్ రాసే అర్హత ఉంటుందో లేదో ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదని తెలిపారు. తమ భవిష్యత్తు కోసం శాంతియుతంగా ధర్నా చేస్తున్న పాలిటెక్నిక్ విద్యార్థులపై క్రూరంగా లాఠీచార్జి చేయించడం అమానుషమన్నారు. దిల్లీలో రాహుల్ గాంధీ ‘చాత్రోం కీ గూంజ’ అని ఉపన్యాసాలు ఇస్తుంటే తెలంగాణలో మాత్రం లాఠీలతో విద్యార్థులను బాదుతున్నారని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీకి ఇక్కడి పరిస్థితులు తెలియజేస్తూ ఇంగ్లీషుతోపాటు ఆయనకు అర్థమయ్యేలా ఇటాలియన్ భాషలో కూడా లేఖ రాశామని, అందుకే ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి



తప్పనిసరి పరిస్థితుల్లో నోరు మెదపాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

**లక్షలాది విద్యార్థుల తరపున బీజేపీ పోరాటం**

విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ కార్యకర్తలు కాలేజీలకు వెళ్లి సుమారు ఎనిమిది లక్షల మంది విద్యార్థుల నుంచి సంతకాలు సేకరించారని స్పష్టం చేశారు. ఆ వినతిపత్రాలను ముఖ్యమంత్రికి అందించేందుకు సమయం కోరితే కనీసం అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని, విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వానికి ఉన్న బాధ్యతారాహిత్యానికి ఇదే నిదర్శనమని విమర్శించారు. తాను ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం 48 గంటల నిరాహార దీక్ష చేశానని, సెక్రటేరియట్ వద్దకు వెళ్లిన బీజేపీ నాయకులను, కార్యకర్తలను అక్రమంగా అరెస్టులు చేసి, కేసులు పెట్టి తీవ్రంగా కొట్టడంతో చాలామంది హాస్పిటల్ పాలయ్యారని గుర్తుచేశారు.

# ఈ పాపం ఈనాటిది కాదు

- **ఉమ్మడి రాష్ట్రం నుంచే 22-ఎ సమస్య**
- **బీఆర్ఎస్ పాలకులు పరిష్కరించి ఉంటే ఈ సమస్య రాకపోను**
- **ఆన్ లైన్‌లో అప్‌లోడ్ చేసే సమయంలో పొరపాటు**
- **తప్పును సరిదిద్దాం**
- **మేం కొత్తగా ఏమీ చేర్చలేదు**
- **రిజిస్ట్రేషన్‌ల ఆదాయం తగ్గిందనడం అవాస్తవం**
- **శాసనసభలో చర్చ.. మంత్రి పొంగులేటి సమాధానం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 :**

22ఏ నిషేధిత జాబితా 2007 నుంచే అమల్లో ఉందని, బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా అదే



విధానాన్ని కొనసాగించిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 2025 డిసెంబరు 3న హైకోర్టు ఆదేశాల మేరకు జాబితాను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే సమయంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దామని చెప్పారు. శనివారం శాసనసభలో ప్రతిపక్షాల ఆరోపణలకు వీడియోలు, అధికారిక రికార్డులతో సమాధానం ఇచ్చారు.

**రిజిస్ట్రేషన్ల ఆదాయం పెరిగింది**

22ఏ వల్ల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయని, ఆదాయం తగ్గిందన్న ఆరోపణలు అవాస్తవమని మంత్రి స్పష్టం చేశారు. గత ఏడాది ఏప్రిల్-ఆగస్టుతో పోలిస్తే ఈ ఏడాది అదే కాలంలో రిజిస్ట్రేషన్ల ఆదాయం రూ.1,359 కోట్లు పెరిగిందని తెలిపారు. సింఫనీ కాలనీలో 22ఏలో ఉన్నది రైల్వే లైన్ కోసం సేకరించిన 4.15 ఎకరాలు మాత్రమేనని, మిగిలిన భూములు ఆ జాబితాలో లేవని చెప్పారు.

**పాత ఆంక్షలే కొనసాగింపు**

హైదర్‌నగర్, శంషీగూడ, ఇస్నాపూర్, సరూర్‌నగర్, రామదాస్‌పల్లి, ఎలికట్ట, పిగ్లిపూర్ ప్రాంతాల్లోని భూములపై మంత్రి వివరణ ఇచ్చారు. ప్రభుత్వ, సీలింగ్, భూదాన్, కోర్టు వివాదాల భూములు మాత్రమే 22ఏలో ఉన్నాయని, పట్టా భూములను కొత్తగా చేర్చలేదని తెలిపారు. యాదాద్రి భువనగిరిలో 40 వేల ఎకరాలు చేర్చారన్న ప్రచారం తప్పని, వాస్తవానికి ఇంటి స్థలాల వివరాల అప్‌డేట్‌లో సాంకేతిక సమస్య తలెత్తిందని చెప్పారు.

**భూముల సంఖ్య తగ్గింది**

కాంగ్రెస్ ప్రభుత్వం 2023 డిసెంబరు 7న బాధ్యతలు చేపట్టే నాటికి 22ఏలో 1,02,52,690 ఎకరాలు ఉండగా, ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి 1,02,05,250 ఎకరాలకు తగ్గిందని మంత్రి తెలిపారు. అంటే 47,440 ఎకరాలు తగ్గినట్లు వివరించారు. ఈ గణాంకాలు ఉండగా లక్షల కోట్ల ఎకరాలు కొత్తగా చేర్చారంటూ ప్రచారం చేయడం సరికాదని అన్నారు.

**కోర్టు ఆదేశాలతో చర్యలు**

2016లో జీవో 121 జారీ చేసినా గత ప్రభుత్వం మార్గదర్శకాలను అమలు చేయలేదని పొంగులేటి విమర్శించారు. 2017-2025 మధ్య 22ఏపై 28,611 కేసులు నమోదయ్యాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనలతో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టామని చెప్పారు. ఆగస్టు 18న ప్రారంభమైన కాల్ సెంటర్‌కు ఫిర్యాదులు క్రమంగా తగ్గి సెప్టెంబరు 7నాటికి 56కు చేరాయని వెల్లడించారు.

## నిమ్స్ వైద్యులకు సీఎం అభినందనలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 :**

నిమ్స్‌లో పీడియాట్రిక్ కార్డియాక్ సర్జరీ క్యాంప్ విజయవంతంగా పూర్తయిన సందర్భంగా వైద్యులు డి.రమణ ధన్నపునేని, ఎం.అమరేష్ రావులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 6 నుంచి 12 వ తేదీ వరకు క్యాంపును నిర్వహించగా పుట్టుకతో గుండె జబ్బులతో బాధపడుతున్న 19మంది చిన్నారులకు శస్త్రచికిత్సలు చేశారు. ఇందులో కేవలం రెండు కిలోల బరువున్న రెండు నెలల పసికందుకు విజయవంతంగా శస్త్రచికిత్స పూర్తి చేయడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైద్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పాల్గొన్నారు.

## డిసెంబర్ 2027కు నాగపూర్ వరంగల్ హైవే పూర్తి

- **మండలిలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 :**



నాగ్‌పూర్‌మంచిర్యాలవరంగల్‌ఖమ్మంవిజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే చాలా ముఖ్యమైన రహదారి అని, మొత్తం 310 కి.మీ పొడవు ఉన్న ఈ ప్రాజెక్టులో 280 కి.మీ తెలంగాణలోనే ఉందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. శాసన మండలిలో సభ్యులు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ప్రొఫెసర్ కోదండరామ్‌లు శనివారం అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. ఈ రహదారి నాలుగైదు జిల్లాలను కలుపుతూ తెలంగాణ నుంచి నాగ్‌పూర్, విజయవాడ వైపు ప్రయాణించే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మంచిర్యాలవరంగల్ రహదారిని ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలిచారని, 2023 మార్చి 31న ఎల్‌వోఏ ఇచ్చి మే 23న అగ్రిమెంట్ జరిగిందని చెప్పారు. మొదట 730 రోజుల్లో అంటే రెండేళ్లలో ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారని, అయితే భూసేకరణ, కోర్టు కేసులు, ఇతర కారణాల వల్ల పనుల్లో ఆలస్యం జరిగిందని వివరించారు. భూసేకరణలో దాదాపు మొత్తం సమస్యలు పరిష్కరించామని, చిన్న చిన్న సమస్యలతో కొంత భూమి మాత్రమే పెండింగ్‌లో ఉందని చెప్పారు. ఆలస్యం కారణంగా కాంట్రాక్టర్‌కు ఎక్స్‌టెన్షన్ ఆఫ్ టైమ్ ఇచ్చి 2027 డిసెంబర్ 31నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాలని నిర్ణయించామన్నారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కూడా మే 26న ఈ ప్రాజెక్టుపై ప్రత్యేకంగా సమీక్షించారన్నారు. తెలంగాణకు ఈ రహదారి ఎంతో ముఖ్యమని, ముఖ్యంగా నాగ్‌పూర్‌కు వెళ్లే ప్రజలకు ఉపయోగకరమని చెప్పారు. భూసేకరణ విషయంలో రైతులకు ఎలాంటి అన్యాయం జరగదన్నారు. వారికి మార్కెట్ రేటు ప్రకారం పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నామని, కోదండరామ్ లేవనెత్తిన భూసేకరణ సమస్యలను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుందని చెప్పారు. ప్రస్తుతం ఒకటి రెండుచోట్ల మాత్రమే భూమి అప్పగింత పెండింగ్‌లో ఉందన్నారు. ఒకచోట సుమారు 1 నుంచి 1.30 కిలోమీటర్లు, మరో ప్యాకేజీలో 5.7 కిలోమీటర్ల మేర సమస్య ఉందని, దాన్ని కూడా త్వరలో పరిష్కరిస్తామని అన్నారు. భూసేకరణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది కాగా, నిర్మాణ పనులు మొత్తం ఎన్‌హెచ్‌ఏఐ ఆధ్వర్యంలో జరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నోడల్ ఏజెన్సీగా ఎన్‌హెచ్‌ఏఐకి పూర్తి సహకారం అందిస్తోందన్నారు. ఆ అధికారులతో మాట్లాడి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు ఇస్తామన్నారు. 31 డిసెంబర్ 2027 నాటికి ఈ కీలక రహదారి ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తామని సభ్యులందరికీ తెలియజేస్తున్నామని మంత్రి వెంకటరెడ్డి చెప్పారు.

## విజయ డెయిరీని బలోపేతం చేస్తాం


- **పాల సేకరణలో తాత్కాలిక తగ్గుదల**
- **పాడి రైతులకు ఎలాంటి బకాయిలు లేవు**
- **శాసనమండలిలో మంత్రి వాకిటి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 :**

విజయ డెయిరీని మరింత బలోపేతం చేసి పాడి రైతులకు అండగా నిలిచేందుకు ప్రజా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య శాఖల మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. శాసనమండలిలో విజయ డెయిరీ పాల సేకరణకు సంబంధించిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. విజయ డెయిరీ పాల సేకరణలో తాత్కాలికంగా స్వల్ప తగ్గుదల నమోదైందంటూ దీర్ఘకాలంగా కొనసాగిన లీన్ సీజన్ కారణంగానే ఈ తగ్గుదల ఏర్పడిందని వివరించారు. గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో విజయ డెయిరీ రోజువారీ సగటు పాల సేకరణ వివరాలను మంత్రి వెల్లడించారు. ఏప్రిల్ 2023 - మార్చి 2024 కాలంలో రోజుకు 3.60 లక్షల లీటర్లు, ఏప్రిల్ 2024మార్చి 2025 కాలంలో రోజుకు 4 లక్షల లీటర్లు, ఏప్రిల్ 2025మార్చి 2026లో రోజుకు 3.36 లక్షల లీటర్లు సేకరించినట్లు తెలిపారు. పాడి రంగంలో రైతులకు మరింత భరోసా కల్పించడంతోపాటు విజయ డెయిరీని ఆధునికీకరించడం, పాల ఉత్పత్తుల మార్కెటింగ్‌ను పెంచడం, వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందించడం వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. పాడి రైతులకు చెల్లించాల్సిన పాల సేకరణ బకాయిలు ఏవీ లేవని మంత్రి



స్పష్టం చేశారు. రైతుల నుంచి సేకరించిన పాలకు సంబంధించి ప్రభుత్వం, విజయ డెయిరీ చెల్లింపుల విషయంలో ఎలాంటి బకాయిలు లేవని తెలిపారు. రాష్ట్రంలోని పాడి రైతులకు దేశంలోనే అత్యధిక ధర చెల్లిస్తున్నామని మంత్రి వెల్లడించారు. ప్రభుత్వం కృత్రిమ పనీరును నిషేధించిందని, విజయ డెయిరీ కేవలం పాలతో తయారు చేసే పనీరును విక్రయిస్తోందని తెలిపారు. విజయ డెయిరీకి ఆదాయం పెంచే విధంగా ఆయా స్థలాల్లో పెట్రోల్ బంకులు, షాపింగ్ కాంప్లెక్స్ లు నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. పశు వైద్య శాఖలో 110మంది వైద్యులను, 304 మంది కాంపౌండర్లను నియమించామని తెలిపారు. రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి పాడి గేదెలను పంపిణీ చేసి పాల ఉత్పత్తులను పెంచేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. డిమాండ్ కు సప్లైకు మధ్య వ్యత్యాసం తగ్గిస్తామని మంత్రి స్పష్టం చేశారు. పాడి రైతుల ప్రయోజనాలే ప్రజా ప్రభుత్వానికి ప్రాధాన్యత అని, విజయ డెయిరీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం కొనసాగిస్తుందని మంత్రి వాకిటి స్పష్టం చేశారు.




## ఏడేళ్ల తర్వాత భారత్ కు చైనా అధ్యక్షుడు జిన్ పింగ్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 :**

చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ భారత్ కు చేరుకున్నారు. 18వ బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు శనివారం న్యూఢిల్లీ కి వచ్చిన ఆయన.. దాదాపు ఏడేళ్ల తర్వాత భారత్ లో అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, జిన్పింగ్ మధ్య ద్వైపాక్షిక భేటీ జరగనుంది. బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో ఇరు దేశాల సంబంధాలపై కీలక చర్చలు జరిగే అవకాశం ఉంది. జిన్ పింగ్ తోపాటు చైనా కమ్యూనిస్టు పార్టీ పొలిట్ బ్యూరో స్టాండింగ్ కమిటీ సభ్యుడు, పార్టీ కేంద్ర కార్యాలయ డైరెక్టర్ కై కీ, పొలిట్ బ్యూరో సభ్యుడు, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ భారత్ వచ్చారు. ఈ విషయాన్ని చైనాలో భారత రాయబారి షూ ఫెయిహోంగ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. 2020లో గల్వాన్ ఘర్షణల తర్వాత భారత్‌చైనా సంబంధాల్లో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. సరిహద్దు ప్రాంతాల్లో శాంతి కొనసాగడం ద్వైపాక్షిక సంబంధాల అభివృద్ధికి కీలకమని భారత్ పదేపదే స్పష్టం చేస్తోంది. ఈ నేపథ్యంలో జిన్ పింగ్ పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. ఇటీవల బిష్కెక్లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సులో మోదీ, జిన్ పింగ్ స్వల్పంగా మాట్లాడుకున్నారు.



### సముద్రం వెనక్కి వెళ్లింది..
## సునామీ కాదు

- అర్జెంటీనా తీరంలో 23 కిలోమీటర్ల మేర తగ్గిన నీరు
- సోషల్ మీడియాలో వైరల్‌గా ప్రకృతి విపత్తు ప్రచారం
- వాతావరణ మార్పులతో తాత్కాలిక పరిణామం
- బలమైన గాలులతో తీరానికి దూరంగా వెళ్లిన నీరు
- సునామీ వస్తుందన్న భయాలు వద్దంటున్న శాస్త్రవేత్తలు

**బ్యూనస్ ఎయిర్స్, సెప్టెంబర్ 12:**

అర్జెంటీనా తీరంలో అట్లాంటిక్ మహాసముద్రం రాత్రికి రాత్రే వెనక్కి వెళ్లిపోయిందంటూ వైరల్ అయిన వీడియోలు తీవ్ర ఆందోళనకు కారణమయ్యాయి. సముద్రం ఏకంగా 23 కిలోమీటర్ల మేర వెనక్కి వెళ్లిందని ప్రచారం జరగడంతో భారీ ప్రకృతి విపత్తుకు ఇది సంకేతమంటూ సోషల్ మీడియాలో చర్చ సాగింది. అయితే ఈ పరిణామం వెనుక ఎలాంటి ప్రకృతి విపత్తు హెచ్చరిక లేదని అర్జెంటీనా తీర ప్రాంత శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు.

**మళ్లీ యథాస్థితికి**

బ్యూనస్ ఎయిర్స్ ప్రావిన్సులోని మార్ డెల్ ప్లాటా తీరంలో సముద్ర మట్టం భారీగా తగ్గడం వాస్తవమేనని శాస్త్రవేత్తలు తెలిపారు. అయితే కొంత సమయం తర్వాత సముద్రం తిరిగి సాధారణ స్థితికి చేరుకుందని వివరించారు. వాతావరణ పరిస్థితుల్లో తాత్కాలిక మార్పులు, సముద్రపు ఆటుపోట్ల చక్రంలో భాగంగానే ఈ పరిణామం చోటుచేసుకుందని పేర్కొన్నారు.

**బలమైన గాలులతో నీరు వెనక్కి**

నిరంతరంగా వీచే బలమైన గాలుల ప్రభావంతో సముద్రపు నీరు తీరానికి దూరంగా నెట్టబడుతుందని అధ్యయనకారులు వివరించారు. దీని వల్ల సముద్రం వెనక్కి వెళ్లినట్లుగా కనిపిస్తుందని, దీనిని 'విండ్ సెట్‌డౌన్' లేదా 'లో టైడ్ సైకిల్'గా పిలుస్తారని తెలిపారు. ఉప్పెన, తుపాను సమయంలో కనిపించే పరిణామాలకు ఇది పూర్తి భిన్నమని స్పష్టం చేశారు.

**సునామీ భయం వద్దు**

సముద్రం వెనక్కి వెళ్లడాన్ని సునామీకి సంకేతంగా భావించాల్సిన అవసరం లేదని శాస్త్రవేత్తలు తెలిపారు. సముద్రగర్భంలో భారీ భూకంపాలు సంభవించినప్పుడు సముద్రపు నీటిలో భారీ మార్పులు చోటుచేసుకుని సునామీ.

# తక్షణమే యూఎన్ఎస్సీ సంస్కరణలు

- ఆలస్యం ఇక ఎంతమాత్రం వద్దు: మోదీ
- నిబంధనలు పాటించేవారిగా కాదు.. రూపొందించేవారిగా మారాలి
- గ్లోబల్ సౌత్‌కు నిర్ణయాధికారం దక్కాలి
- అధికార పిరమిడ్‌ను మార్చాలి
- ఏఐ, సైబర్, బయోటెక్‌లో సహకారం పెంచాలి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12:**

ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి (యూఎన్ఎస్సీ)లో తక్షణమే సంస్కరణలు చేపట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఈ విషయంలో ఇక ఎలాంటి జాప్యానికీ తావులేదని స్పష్టం చేశారు. ఢిల్లీలో జరుగుతున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు అధ్యక్షత వహించిన మోదీ.. గ్లోబల్ సౌత్ దేశాలు ఇతరులు రూపొందించిన నిబంధనలను పాటించేవారిగా కాకుండా, ప్రపంచ నిర్ణయాలను ప్రభావితం చేసే శక్తిగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న సంఘర్షణలకు ఉమ్మడి పరిష్కారాలు చూపాల్సిన బాధ్యత బ్రిక్స్‌పై ఉందన్నారు. ఈ చారిత్రక మార్పుకు నాయకత్వం వహించేందుకు భారత్ సిద్ధంగా ఉందని ప్రకటించారు.

**నిర్ణయాధికారం కొన్ని దేశాలకే ఎందుకు?**

బ్రిక్స్ ఏర్పడి రెండు దశాబ్దాలు పూర్తయిన నేపథ్యంలో ప్రపంచ వేదికపై కూటమి ప్రత్యేక స్థానం సంపాదించిందని మోదీ తెలిపారు. కష్టకాలంలో ఉమ్మడి బాధ్యత తీసుకుంటూ, పరస్పర సహకారంతో సభ్యదేశాల ప్రజలకు మరింత అభివృద్ధిపై భరోసా కల్పించాలన్నారు. ప్రపంచ సవాళ్ల పరిష్కారంలో గ్లోబల్ సౌత్ దేశాలు ముందువరుసలో ఉంటున్నప్పటికీ.. అంతర్జాతీయ నిర్ణయాలు తీసుకునే సమయంలో మాత్రం వెనుకబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత అంతర్జాతీయ పాలనా వ్యవస్థ పిరమిడ్ ఆకారంలో ఉందని, అధికారం కొద్దిపాటి దేశాల వద్దే కేంద్రీకృతమైందని విమర్శించారు. కింది స్థాయిలో ఉన్న దేశాలు నిర్ణయాల ప్రభావాన్ని ఎదుర్కొంటున్నాయే తప్ప.. వాటిని ప్రభావితం చేయలేకపోతున్నాయని పేర్కొన్నారు.



**సమాన హక్కులతో భాగస్వామ్య వేదిక**

అధికార పిరమిడ్ వ్యవస్థకు ముగింపు పలికి ప్రతి దేశానికి సమాన హక్కులు, స్పష్టమైన ప్రాతినిధ్యం కల్పించే భాగస్వామ్య వ్యవస్థను తీసుకురావాలని మోదీ సూచించారు. బ్రిక్స్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రపంచ పాలనా వ్యవస్థలో సమగ్ర సంస్కరణల కోసం సభ్యదేశాలు ఏకతాటిపైకి రావాలని కోరారు. అంతర్జాతీయ సమస్యలకు పరిష్కారాలు అన్వేషించే ప్రతి అడుగులో మానవాభివృద్ధే కేంద్ర బిందువుగా ఉండాలని స్పష్టం చేశారు. ఏఐ, సైబర్‌స్పేస్, బయోటెక్నాలజీ రంగాల్లో సభ్యదేశాల మధ్య పరస్పర సహకారాన్ని మరింత పెంచుకోవాలని పిలుపునిచ్చారు.

# ఢిల్లీలో మోదీ–జిన్‌పింగ్ భేటీ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13:**

బ్రిక్స్ సదస్సు కోసం ఢిల్లీకి వచ్చిన చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. భారత మండపంలో జరిగిన ఈ సమావేశంలో సరిహద్దు వివాదం, వాణిజ్యం సహా పలు ద్వైపాక్షిక అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. అనంతరం భారత్‌తో దీర్ఘకాలిక, వ్యూహాత్మక ఒప్పందాలను కొనసాగిస్తామని జిన్‌పింగ్ తెలిపారు. ప్రపంచంలో అతిపెద్ద దేశాలైన భారత్, చైనాలు కలిసి పనిచేస్తూ పరస్పరం సహకరించుకోవాలని పిలుపునిచ్చారు.

**మోదీని కలవడం ఆనందంగా ఉంది**

ద్వైపాక్షిక సంబంధాల దీర్ఘకాలిక అభివృద్ధిని వ్యూహాత్మక దృష్టితో ముందుకు తీసుకెళ్లడం వల్లే భారత్-చైనా సంబంధాలు పురోగమించాయని జిన్‌పింగ్ అన్నారు. ఇరు దేశాలు భిన్నమైనవే అయినప్పటికీ ఉమ్మడి అభివృద్ధి కోసం పరస్పరం మద్దతు ఇచ్చుకున్నాయని తెలిపారు. ఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ సదస్సుకు హాజరుకావడం, ప్రధాని మోదీని మరోసారి కలవడం ఆనందంగా ఉందన్నారు. భారత్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సు విజయవంతం కావడంపై మోదీకి అభినందనలు తెలిపారు.



**ఇరుదేశాలు ఉమ్మడిగా అభివృద్ధి చెందాలి**

గత 12 ఏళ్లలో ఢిల్లీకి రావడం తనకు ఇది రెండోసారని జిన్‌పింగ్ గుర్తుచేశారు. ఈ కాలంలో మోదీని 21 సార్లు కలిశానని తెలిపారు. ఈ సమావేశాల ద్వారా ఇరు దేశాల మధ్య అనేక అంశాల్లో ఏకాభిప్రాయాలు కుదిరాయని చెప్పారు. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశాలుగా, గ్లోబల్ సౌత్‌లో కీలక సభ్యులుగా భారత్, చైనాలకు మానవాళి ఉమ్మడి భవిష్యత్తు కోసం ప్రత్యేక బాధ్యతలు ఉన్నాయని పేర్కొన్నారు. ఒకరి సామర్థ్యాల నుంచి మరొకరు నేర్చుకుంటూ ఉమ్మడి అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. నాణ్యమైన సహకారాన్ని కొనసాగిస్తూ సమానత్వం, సమ్మిళితత్వం, స్వేచ్ఛాయుత ఆర్థిక వ్యవస్థ కోసం కలిసి పనిచేయాలని సూచించారు. ఆధునిక సాంకేతికతను వినియోగించుకుని వేగంగా పురోగతి సాధించాలని అన్నారు.

**నిర్మాణాత్మక చర్చలకు భారత్ సిద్ధం**

జిన్‌పింగ్‌తో సమావేశం అనంతరం మోదీ మాట్లాడుతూ బ్రిక్స్ సదస్సుకు చైనా అందించిన మద్దతు, సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ద్వైపాక్షిక సహకారానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించే అవకాశం లభించిందన్నారు. నిర్మాణాత్మక చర్చలకు భారత్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు. బ్రిక్స్ సదస్సులో జిన్‌పింగ్ చేసిన సానుకూల వ్యాఖ్యలకు ధన్యవాదాలు తెలిపారు.

**ఏడేళ్ల తర్వాత భారత్‌కు జిన్‌పింగ్**

2019లో చివరిసారిగా భారత్‌లో పర్యటించిన జిన్‌పింగ్.. ఏడేళ్ల విరామం తర్వాత మళ్లీ దేశానికి వచ్చారు. అంతకుముందు 2014, 2016లో ఆయన భారత్‌లో పర్యటించారు. 2020లో గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణల తర్వాత భారత్-చైనా సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో 2019 తర్వాత జిన్‌పింగ్ భారత్‌కు రాలేదు. తాజాగా బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో ఆయన ఢిల్లీకి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఢిల్లీ డిక్లరేషన్‌కు ఏకాభిప్రాయ ఆమోదం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12:**

బ్రిక్స్ సభ్యదేశాల ఆమోదంతో ఢిల్లీ డిక్లరేషన్‌కు ఏకాభిప్రాయం లభించిందని ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రకటించారు. భారత్ దౌత్య ప్రయత్నాల ఫలితంగా పశ్చిమాసియా సంక్షోభంపై విభేదాలు ఉన్న ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా సైతం ఉమ్మడి ప్రకటనకు ఆమోదం తెలిపాయి. ప్రారంభంలో ఇరాన్, యూఏఈలు కఠిన వైఖరి అవలంభించడంతో చర్చలు చివరి నిమిషం వరకు ఉత్కంఠభరితంగా సాగాయి. బ్రిక్స్ ఏకాభిప్రాయంతో పనిచేసే కూటమి కావడంతో ఏ ఒక్క దేశం వ్యతిరేకించినా ప్రకటన నిలిచిపోయే పరిస్థితి ఉండేది. వరుసగా జరిగిన తెరవెనుక చర్చలతో ప్రతిష్టంభన తొలగి, సభ్యదేశాలన్నీ సంయుక్త ప్రకటనకు ఆమోదం తెలిపాయి.

**పాత వ్యవస్థలు ఇక పనికిరావు**

సదస్సు ముగింపు ప్రసంగంలో మోదీ మాట్లాడుతూ మారుతున్న ప్రపంచాన్ని పాతబడిపోయిన వ్యవస్థలు నడపలేవని అన్నారు. ప్రాతినిధ్యం, స్పందన, నిబంధనల రూపకల్పనలో సంస్కరణలు అవసరమని స్పష్టం చేశారు. భవిష్యత్తు సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధి, వాటి నియంత్రణకు సంబంధించిన నిబంధనల రూపకల్పనలో గ్లోబల్ సౌత్ దేశాలకు సమాన భాగస్వామ్యం ఉండాలని పేర్కొన్నారు. నిర్ణయాలు, వాటి ఫలితాల మధ్య ఉన్న అంతరాన్ని భాగస్వామ్యం, ఉమ్మడి కార్యాచరణతోనే పూడ్చగలమన్నారు. ఢిల్లీ డిక్లరేషన్ ఉమ్మడి సంకల్పానికి దిశానిర్దేశం చేస్తుందని, తీర్మానాలను ఆచరణాత్మక ఫలితాలుగా మార్చాల్సిన బాధ్యత సభ్యదేశాలపై ఉందని తెలిపారు.



**యూఎన్ భద్రతా మండలిలో భారత్‌కు మద్దతు**

ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో నిర్మాణాత్మక సంస్కరణలు చేపట్టాలని ఢిల్లీ డిక్లరేషన్ ఆకాంక్షించింది. ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా దేశాలకు మెరుగైన ప్రాతినిధ్యం కల్పించాలని సూచించింది. భద్రతా మండలిలో భారత్, బ్రెజిల్‌కు మరింత పెద్ద పాత్ర దక్కాలన్న డిమాండ్‌కు శాశ్వత సభ్యదేశాలైన చైనా, రష్యాలు మద్దతు పునరుద్ఘాటించాయి. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకుల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మరింత ప్రాతినిధ్యం కల్పించాలని బ్రిక్స్ కోరింది.

**స్థానిక కరెన్సీలతో వాణిజ్యానికి ప్రాధాన్యం**

బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్యంలో డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించి, స్థానిక కరెన్సీల వినియోగాన్ని పెంచాలని డిక్లరేషన్ పేర్కొంది. సరిహద్దు చెల్లింపులకు ఆచరణాత్మక పరిష్కారాలను సులభతరం చేయాలని సూచించింది. ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఏకపక్షంగా విధిస్తున్న సుంకాలు, బలవంతపు చర్యలపై ఆందోళన వ్యక్తం చేసింది.

**పహల్గాం దాడిని ఖండించిన బ్రిక్స్**

ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ ప్రదర్శించాలని బ్రిక్స్ పిలుపునిచ్చింది. పహల్గాం ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తూ సరిహద్దు ఉగ్రవాదం, ఉగ్రనిధులను అరికట్టాలని స్పష్టం చేసింది. ఉగ్రవాద నిర్మూలనలో ద్వంద్వ వైఖరిని వీడాలని కోరింది. అణు కేంద్రాలపై దాడులు, పెరుగుతున్న అణ్వస్త్ర ప్రమాదాలను కూడా ఖండించింది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు అందాల్సిన నిధులు పక్కదారి పడుతుండగా ప్రపంచ సైనిక వ్యయం పెరగడంపై విచారం వ్యక్తం చేసింది.

**శిలాజ ఇంధనాల అవసరం గుర్తింపు**

అభివృద్ధి చెందుతున్న దేశాలకు శిలాజ ఇంధనాలు ఇంకా అవసరమేనని డిక్లరేషన్ పేర్కొంది. అదే సమయంలో పర్యావరణ అనుకూల ఇంధనాల వైపు మారాలని సూచించింది. ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్ ఏర్పాటు చేయాలని సభ్యదేశాలు నిర్ణయించాయి. ఆర్థిక, సామాజిక వృద్ధిలో మహిళలు నిర్ణయాధికారులుగా కీలక పాత్ర పోషించాలని న్యూఢిల్లీ డిక్లరేషన్ గుర్తించింది.

# పంచాయతీలకు ఇక ఆర్థిక స్వేచ్ఛ



- వాటి సొంత ఆదాయం సొంత ఖాతాల్లోనే జమ
- చట్ట సవరణపై సర్పంచ్‌ల హర్షం
- మంత్రి సీతక్కకు సన్మానం

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 :**

గ్రామ పంచాయతీలకు ఆర్థిక స్వేచ్ఛ, ఆర్థిక స్వావలంబన కల్పించేలా పంచాయతీరాజ్ చట్టానికి సవరణ తీసుకొచ్చినందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ద□నసరి అనసూయ సీతక్కకు సర్పంచులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సౌధాని భూమన్న యాదవ్ నేతృత్వంలో వందలాదిమంది సర్పంచులు, పంచాయతీరాజ్ ఛాంబర్స్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణ రెడ్డి నేతృతంలో వందలాదిమంది సర్పంచ్‌లు ప్రజాభవన్‌కు శనివారం తరలివచ్చి మంత్రి సీతక్కను ఘనంగా సన్మానించారు. గ్రామ పంచాయతీలకు సంబంధించిన సొంత ఆదాయాన్ని ట్రెజరీలో జమ చేయాల్సిన పరిస్థితి నుంచి బయటకు తీసుకొచ్చి పంచాయతీల సొంత ఖాతాల్లోనే జమ చేసుకునేలా చట్ట సవరణకు కృషి చేసినందుకు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. గజమాలతో సత్కరించారు. ఇంతకాలం పంచాయతీలు తమ పరిధిలో సమకూర్చుకున్న సొంత ఆదాయాన్ని నేరుగా వినియోగించుకునే అవకాశం లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురయ్యాయని సర్పంచులు తెలిపారు. గ్రామంలో అత్యవసరమైన చిన్నచిన్న పనులు చేయించుకోవడానికి కూడా నిధుల కోసం ఎదురుచూడాల్సి వచ్చేదని, దీనివల్ల ప్రజలకు తక్షణ సేవలు అందించడంలో ఇబ్బందులు తలెత్తేవని పేర్కొన్నారు. చట్ట సవరణతో గ్రామ పంచాయతీలకు మరింత ఆర్థిక స్వేచ్ఛ లభిస్తుందని, స్థానికంగా సమకూరే ఆదాయాన్ని స్థానిక అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఏర్పడుతుందని సర్పంచులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీలను బలోపేతం చేయడం ద్వారా మాత్రమే గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుందని, ఆ దిశగా చొరవ తీసుకున్న మంత్రి సీతక్కకు ధన్యవాదాలు తెలిపారు. ఈ చట్ట సవరణ ఏకగ్రీవంగా ఆమోదం పొందేలా మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ తీసుకోవడం పట్ల సర్పంచులు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం గ్రామ పంచాయతీలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందంటూ పంచాయతీల సొంత ఖాతాల్లో సొంత ఆదాయాన్ని జమ చేసుకునేలా అనుమతులు మంజూరు చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కూడా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లను ఉద్దేశించి మంత్రి సీతక్క మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు ఆర్థిక స్వేచ్ఛ కల్పించాలన్నది తమ ప్రభుత్వ స్పష్టమైన విధానమని అన్నారు. 'గ్రామ పంచాయతీకి వచ్చిన ఆదాయం గ్రామ పంచాయతీ అభివృద్ధికే ఉపయోగపడాలి.. ప్రజల నుంచి వసూలు చేసిన సొంత ఆదాయం కోసం పంచాయతీలు ఎవరి చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండకూడదు' అని అన్నారు. ఇకపై పంచాయతీలు తమ సొంత ఆదాయాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించుకొని స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. '73వ రాజ్యాంగ సవరణ స్ఫూర్తి స్థానిక సంస్థలకు అధికారాలు, విధులు, ఆర్థిక వనరులు కల్పించడమే.. ఆ స్ఫూర్తికి అనుగుణంగా పంచాయతీలను మరింత బలోపేతం చేయాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం' అని సీతక్క అన్నారు. పంచాయతీలకు ఆర్థిక స్వేచ్ఛ కల్పించే చట్ట సవరణకు సహకరించిన సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు మంత్రి సీతక్క కృతజ్ఞతలు తెలిపారు. ఇది సర్పంచుల విజయం మాత్రమే కాదు.. ప్రతి గ్రామ ప్రజల విజయం. గ్రామ పంచాయతీ చేతికి వచ్చిన ఆర్థిక స్వేచ్ఛ చివరకు గ్రామ ప్రజల అభివృద్ధికి ఉపయోగపడాలి అని అన్నారు. 'గ్రామ స్వరాజ్యం మాటల్లో కాదు.. గ్రామ పంచాయతీలకు ఆర్థిక, పరిపాలనా స్వేచ్ఛ కల్పించినప్పుడే అది నిజమైన గ్రామ స్వరాజ్యం అవుతుంది. ఆ దిశలో ప్రజా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది' అని ఆమె చెప్పారు.

## విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఏబీవీపీ డిమాండ్



**శెనార్తి మీడియా, బెజ్జంకి :**

విద్యా రంగంలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు పోలీసులు ఏబీవీపీ నాయకుడు అడుకని వీరేశం ను ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వీరేశం మాట్లాడుతూ, హక్కుల కోసం గళమెత్తుతున్న విద్యార్థులను అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామిక చర్య అని మండిపడ్డారు. విద్యార్థుల సమస్యలపై శాంతియుతంగా పోరాడుతున్న వారిని అరెస్టులు, నిర్బంధాలతో అణచివేయాలని చూడటం సరైన విధానం కాదన్నారు.అరెస్టులతో విద్యార్థుల గొంతును నొక్కలేరని, విద్యార్థుల సమస్యలు పరిష్కరించే వరకు తమ పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థుల హక్కుల కోసం ఏబీవీపీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.

## బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్‌గా కునారపు శ్రీనాథ్

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**



బీజేపీ శంకరపట్నం మండల సోషల్ మీడియా కన్వీ నర్ గా ముత్తారం గ్రామానికి చెందిన కునారపు శ్రీనాథ్ నియమితులయ్యారు. ఈ మేరకు మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్ తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, క్రమశిక్షణకు అనుగుణంగా పనిచేస్తూ మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని శ్రీనాథ్ కు సూచించారు. తనకు బాధ్యత అప్పగించిన పార్టీ నాయకులకు శ్రీనాథ్ కృతజ్ఞతలు తెలిపారు.

## వివాదాలకు రాజీ మార్గమే శాశ్వత పరిష్కారం

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నీరజ

**శెనార్తి మీడియా, సిరిసిల్ల:** చిన్నచిన్న వివాదాలను పెద్దవిగా చేసుకొని శారీరకంగా, ఆర్థికంగా, మానసికంగా నష్టపోకుండా పరస్పర అవగాహనతో పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు పి. నీరజ సూచించారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ ప్రారంభ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న రాజీ చేయదగిన కేసులు, ప్రీ–లిటిగేషన్ కేసులను పరస్పర అంగీకారంతో పరిష్కరించేందుకు లోక్ అదాలత్ ఉత్తమ వేదిక అని తెలిపారు. భార్యాభర్తలు చిన్న విభేదాలతో విడిపోకుండా పరస్పరం అర్థం చేసుకోవాలని, అన్నదమ్ములు ఆస్తి, భూ వివాదాలను రాజీ ద్వారా పరిష్కరించుకొని కుటుంబ ఐక్యతను కాపాడుకోవాలని కోరారు. లోక్ అదాలత్ ద్వారా సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధిక జైస్వాల్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి పి. లక్ష్మణాచారి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆవునూరి రమాకాంతరావు, డీఎస్పీ నాగేంద్రచారి, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు

## బంగారు, వెండి ఆభరణాల చోరీ కేసు ఛేదన

**శెనార్తి మీడియా, ఆదిలాబాద్ :** గుడిహత్నూర్‌లో జరిగిన బంగారు, వెండి ఆభరణాల చోరీ కేసును పోలీసులు ఛేదించారు. రూ.85,600 విలువైన ఆభరణాలను 100 శాతం రికవరీ చేసి, ప్రధాన నిందితుడు పెందూర్ మధుకర్ (21)ను అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఎల్. శ్రీకాంత్ తెలిపారు. క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్ ఆధారాలతో కేసును ఛేదించిన పోలీసులు, చోరీ సొత్తు కొనుగోలు చేసిన గోల్డ్‌స్మిత్ దహాలే సంతోష్ (46)పై కూడా కేసు నమోదు చేశారు.

## ఏఐపై వర్కింగ్ జర్నలిస్టులకు వర్క్‌షాప్

**శెనార్తి మీడియా, హైదరాబాద్:** వర్కింగ్ జర్నలిస్టుల కోసం తెలంగాణ మీడియా అకాడమీ సెప్టెంబర్ 16న "ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI)"పై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించనుంది. నాంపల్లి, ఛాపెల్ రోడ్డులోని మీడియా అకాడమీ ఆడిటోరియంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. ఏఐ పరిచయం, వినియోగించే టూల్స్, పద్ధతులు, బాధ్యతాయుత వినియోగం, నైతిక ప్రమాణాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఆసక్తి గల జర్నలిస్టులు పేరు, మీడియా సంస్థ, ప్రదేశం, మొబైల్ నంబర్ వివరాలను 7093600977 వాట్సాప్ నంబర్‌కు సెప్టెంబర్ 15లోగా పంపాలి.



## కేశవపట్నంలో ఘనంగా గణేశుడి ప్రతిష్ఠాపన

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

కేశవపట్నం పెట్రోల్ బంక్ సమీపంలోని వినాయక మండపంలో శనివారం గణేశుడి విగ్రహాన్ని ఘనంగా ప్రతిష్ఠించారు. అంబేద్కర్ విగ్రహం నుంచి బ్యాండ్ మేళాల నడుమ భక్తులు విగ్రహాన్ని ఊరేగింపుగా మండపానికి తీసుకొచ్చారు. అనంతరం వేదమంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో కేశవపట్నం ఉపసర్పంచ్ ఆకుబత్తిని విజయకుమార్‌తో పాటు భక్తులు పాల్గొన్నారు.

## సేవా సంకల్ప్ అభియాన్‌పై బీజేపీ కార్యశాల



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఆయన జన్మదినం సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా 9 సేవా కార్యక్రమాలపై శంకరపట్నం మండలంలో కార్యశాల నిర్వహించారు. లక్ష్మి ప్రసన్న గార్డెన్‌లో మండల పార్టీ అధ్యక్షుడు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ సీనియర్ నాయకుడు కనమల్ల గణపతి 9 సేవా కార్యక్రమాల ఉద్దేశ్యం, ప్రాధాన్యతను వివరించారు. ప్రధాని మోదీ సేవా స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కార్యక్రమాలను సమన్వయంతో విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దండు కొమురయ్య, సర్పంచ్ వెన్నం మల్లేష్, నాయకులు దొంగల రాములు, దాసారపు నరేందర్, నిమ్మశెట్టి సంపత్, కొయ్యడ అశోక్, రాసమల్ల శ్రీనివాస్, మందాడి జగ్గారెడ్డి, బోడ తిరుపతి రెడ్డి, బొజ్జ సాయిప్రకాష్, చుక్కల శ్రీకాంత్, బిజిలి సారయ్య, కునారపు శ్రీనాథ్, గుర్రం శ్రీనివాస్, పంజాల అనిల్, పోతునూరి రాజు, వడ్లకొండ రాజేందర్, దాసారపు సంపత్, గూళ్ళ రాజు, మెడిశెట్టి రాజేష్, తిరుపతి రావు, నూనె శ్రీనివాస్‌తో పాటు బూత్ అధ్యక్షులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# 'గుడి లేని దేవత'.. గుండెల్లో కొలువైన 'అనిత'








- **అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ డా.కే.అనితా రెడ్డి**
- **పేద పిల్లలకు అండగా.. వృద్ధులకు బిడ్డగా.. మానసిక వికలాంగ చిన్నారులకు అమ్మగా.. మూడు దశాబ్దాలుగా అలసట లేని సేవా ప్రస్థానం..**
- **సేవకు సెలవు లేదు.. ఆత్మీయతకు అలసట లేదు..**
- **మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న మానవతా ప్రయాణం**
- **అనాథలకు అమ్మగా.. వృద్ధులకు బిడ్డగా.. ఆడపిల్లలకు ఆత్మీయురాలిగా**
- **పురస్కారాల కంటే.. పేద పిల్లల చిరునవ్వే ఆమెకు గొప్ప బహుమతి**

**శెనార్తి మీడియా, హనుమకొండ :** కొంతమంది దేవుడిని గుడిలో వెతుకుతారు, మరికొందరు దేవుడి కోసం కొండలు, కోనల్లో తిరుగుతారు. కానీ ఆపదలో ఉన్నవారి కన్నీటిని తుడిచే చేతుల్లో, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టే మనసులో, దిక్కులేని వృద్ధులకు ఆప్యాయత పంచే చిరునవ్వులో, మానసిక వికలాంగులైన చిన్నారులను అమ్మలా అక్కున చేర్చుకునే హృదయంలో దైవత్వాన్ని చూడొచ్చు. అలాంటి మానవత్వానికి ప్రతిరూపమే డా.కే.అనితా రెడ్డి. అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్‌గా, కాకతీయ విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యురాలిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆమె, పదవులు, హోదాలు, పురస్కారాలకు అతీతంగా మూడు దశాబ్దాలుగా కొనసాగిస్తున్న సేవా ప్రయాణం ఎందరికో స్ఫూర్తిదాయకం. ప్రచారం కోసం కాదు, ప్రశంసల కోసం కాదు, ఎవరో గుర్తించాలని కాదు, ఒక మనిషికి మరో మనిషి అండగా ఉండాలనే మానవతా విలువతో ఆమె అడుగులు ముందుకు సాగుతున్నాయి.

### ఆడపిల్లలకు ఆత్మీయురాలు.. మార్గదర్శి...

ఆడపిల్లల జీవితంలో ఎదురయ్యే సమస్యలను సొంత సమస్యలుగా భావిస్తూ వారికి ఆత్మీయురాలిగా నిలుస్తున్నారు. అవసరమైనప్పుడు ఒక స్నేహితురాలిలా పలకరిస్తూ, ఒక మార్గదర్శిలా దారి చూపుతూ.. తల్లిలా ధైర్యం చెబుతూ వారి వెన్నంటే ఉంటున్నారు. "నీవు ఒంటరివి కాదు నీ వెంటే ఎవరో ఉన్నారు" అనే భరోసా ఒక్కటే ఎన్నో జీవితాల్లో కొత్త వెలుగును నింపింది. చదువుకోవాలనే తపన ఉన్న పేద విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందించడం నుంచి అవసరమైన వారికి దుస్తులు, దుప్పట్లు అందించడం వరకు ఆమె సేవా స్పర్శ విస్తరించింది.

### వృద్ధులకు బిడ్డలా.. చిన్నారులకు అమ్మలా...

వృద్ధాశ్రమాల్లోని వృద్ధుల వద్దకు వెళ్లినప్పుడు ఆమెకు వారు వృద్ధులుగా కనిపించరు తన ఇంటి పెద్దలుగానే కనిపిస్తారు. వారి బాధలు వింటారు. ఆప్యాయంగా పలకరిస్తారు. అవసరాలు తెలుసుకుంటారు. కొద్దిసేపు వారితో గడిపినా ఆ సమయం వారికి ఎంతో విలువైనదిగా మారుతుంది. మానసిక వికలాంగుల ఆశ్రమాల్లోని చిన్నారుల దగ్గరకు వెళ్లినప్పుడు మాత్రం ఆమె ఒక సేవకురాలిగా కాదు, అమ్మలా మారిపోతారు. వారి అమాయకమైన చిరునవ్వులో ఆనందాన్ని వెతుక్కుంటారు. వారి చిన్నచిన్న అవసరాలను గమనిస్తారు. ఓర్పుతో, సహనంతో వారిని అక్కున చేర్చుకుంటారు. వారికి మందులు కావాలా, వైద్యం అవసరమా, బట్టలు కావాలా, ఆహారం కావాలా, ఏ అవసరం ఉన్నా తన వంతు చేయడానికి ముందుంటారు. ఆశ్రమాల్లో తరచూ వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ఆరోగ్య సంరక్షణకు తోడ్పడుతున్నారు.

### ఇవ్వడంలోనే ఆనందం...

పేద విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందించిన సందర్భాలు ఎన్నో.. అవసరమైన వారికి దుస్తులు, దుప్పట్లు పంచిన సందర్భాలు ఎన్నో.. ఆశ్రమాలకు వైద్య సేవలు అందించిన సందర్భాలు ఎన్నో. కానీ ఆమె చేసిన సేవలను లెక్కపెట్టడం కంటే వాటి వెనుక ఉన్న మనసును అర్థం చేసుకోవడమే ముఖ్యమని ఆమెను దగ్గరగా చూసిన వారు చెబుతారు. ఒక పుస్తకం ఒక విద్యార్థి భవిష్యత్తును మార్చవచ్చని, ఒక దుప్పటి ఒక వృద్ధుడి చలిని తీర్చవచ్చని, ఒక ఆప్యాయమైన మాట ఒకరి జీవితంలో ఆశను నింపవచ్చని ఆమె నమ్ముతారు. అందుకే సేవ ఆమెకు ఒక కార్యక్రమం కాదు, జీవన విధానం.

### అవార్డులు ఎన్నో.. గర్వం లేని నిగర్వి...

సామాజిక సేవకు గుర్తింపుగా ఆమెకు ఎన్నో అవార్డులు, సత్కారాలు లభించాయి. మరెన్నో ఉన్నత పురస్కారాలు ఆమె సేవా ప్రయాణాన్ని గుర్తించాయి. అయితే అవార్డు అందుకున్న ప్రతిసారీ ఆమె అడుగులు మరింత వినయంగా మారాయి. తన సేవా కార్యక్రమాల్లో భర్త రాంరెడ్డి ప్రోత్సాహం మరువలేనిదని గర్వంగా చెపుతారు. పురస్కారం తన గొప్పతనానికి గుర్తింపు కాదని, సమాజం తనపై ఉంచిన బాధ్యతకు గుర్తింపుగా భావిస్తారు. ఎంత ఉన్నతమైన అవార్డు వచ్చినా, మరుసటి రోజే మళ్లీ అదే సాధారణ జీవితం. అదే ఆత్మీయత. అదే చిరునవ్వు. అదే సేవా సంకల్పం. ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండటం, గుర్తింపు వచ్చినా గర్వపడకపోవడం. చేసిన సేవను చెప్పుకోవడానికి ఇష్టపడకపోవడం ఆమె వ్యక్తిత్వంలోని ప్రత్యేకత.

### ఇంకా ఏదో చేయాలి...

సేవా కార్యక్రమాలు ఎన్నో చేసినా.. ఆమెకు మాత్రం ఇంకా ఏదో చేయలేదనే భావన. ఒక సమస్య పరిష్కారమైతే మరో సమస్య ఆమె కళ్లకు కనిపిస్తుంది. ఒక చిన్నారికి సహాయం చేస్తే.. ఇంకో చిన్నారి కోసం ఆలోచన మొదలవుతుంది. ఒక ఆశ్రమాన్ని సందర్శించి వస్తే.. మరో ఆశ్రమానికి వెళ్లాలనే తపన మొదలవుతుంది. సేవ చేసినందుకు అలసట ఉండదు. సేవ చేయలేకపోతేనే మనసుకు అసంతృప్తి. అందుకే ఆమె సేవా ప్రయాణానికి ముగింపు లేదు. విరామం లేదు. అలక లేదు. అలసట లేదు.

### దేవుడిచ్చిన వరంగా భావించే జన్మ...

'ఈ జన్మ దేవుడిచ్చిన వరం. ఆ వరాన్ని నా కోసం మాత్రమే కాకుండా నన్ను అవసరమైన వారికి ఉపయోగపడేలా చేయాలి అనే ఆలోచన ఆమెను నడిపిస్తోంది. పేద పిల్లలకు చదువులో తోడుగా నిలవాలి. ఆశ్రమాల్లోని వృద్ధులకు కుటుంబ సభ్యురాలిలా ఆప్యాయత పంచాలి. మానసిక వికలాంగులైన చిన్నారులకు అమ్మలా అండగా ఉండాలి. తనకు చేతనైనంత వరకు మరొకరి జీవితంలో వెలుగు నింపాలి, ఇదే ఆమె సంకల్పం. ఆమెకు సేవ అంటే దానం చేయడం మాత్రమే కాదు. ఒకరి బాధను తన బాధగా భావించడం.. ఒకరి కన్నీటిని తన హృదయంతో తుడవడం.. ఒకరి ఒంటరితనాన్ని ఆత్మీయతతో నింపడం. అందుకే ఆమె అడుగుపెట్టిన చోట సహాయం మాత్రమే కాదు, ఆశ కూడా కనిపిస్తుంది.

### గుడిలో దేవతలు ఉంటారు.. ఆమె గుండెల్లో మానవత్వం ఉంది...

ఆమెను చూసినవారికి ఆమె ఒక వ్యక్తిగా కనిపించవచ్చు. కానీ ఆమెతో కలిసి ప్రయాణించిన వారికి మాత్రం ఆమె ఒక ఆత్మీయత. పేద పిల్లలకు ఆమె ఆశాకిరణం. ఆడపిల్లలకు ఆమె ఆత్మీయురాలు. వృద్ధులకు ఆమె బిడ్డ. మానసిక వికలాంగ చిన్నారులకు ఆమె అమ్మ. అవసరంలో ఉన్నవారికి ఆమె అండ. సమాజానికి ఆమె ఒక స్ఫూర్తి. గుడిలోని దేవతకు పూలు సమర్పిస్తాం, కానీ గుడి గడప దాటిన తర్వాత మనిషిలోని దేవుడిని గుర్తించడం మరిచిపోతాం. అనితా రెడ్డి మాత్రం ఆ మానవత్వాన్నే తన జీవిత పూజగా మార్చుకున్నారు. ప్రశంసల కోసం కాదు, పురస్కారాల కోసం అంతకన్నా కాదు, పేరు కోసం కాదు. ఎవరో ఒకరి జీవితంలో మీ వల్ల నాకు మేలు జరిగింది అనే ఒక్క మాట వినిపిస్తే చాలు అన్నట్టుగా ఆమె సేవా ప్రయాణం సాగుతోంది. అందుకే ఆమెను పరిచయం చేయడానికి హోదాలు సరిపోవు.అవార్డులు సరిపోవు. ఆమె చేసిన సేవల జాబితా కూడా సరిపోదు. ఆమె ఒక సేవా మనసు. ఆమె ఒక ఆత్మీయత. ఆమె ఒక భరోసా. ఆమె ఒక మానవతా దీపం. గుడిలో లేని దేవత, మనుషుల మధ్య నడిచే దేవత డా.కే.అనితా రెడ్డి.







# పురాణ పురుషులు మల్లాది చంద్ర శేఖరులు

## నేడు అభినవ వ్యాస మల్లాది చంద్రశేఖర శాస్త్రి జయంతి

ఆయన పురాణ ప్రవచనం గావిస్తుంటే పండిత పామరులు మంత్రముగ్ధులయి తీరాల్సిందే. ధర్మసందేహాలు కార్యక్రమంలో శ్రోతల సందేహాలకు సమాధానాలు చెబుతుంటే కార్యక్రమంలో లీనం కావాల్సిందే. భద్రాచాల సీతారాముల కల్యాణానికిగాని, తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలకు గాని, శ్రీశైలంలో భ్రమరాంబా మల్లికార్జునుల కల్యాణానికి గానీ వ్యాఖ్యానం చేస్తుంటే శ్రోతలు తమ చెవులు అప్పగించాల్సిందే. ఆయన గళం నుంచి వెలువడే ప్రతిమాటా సప్రామాణికం, సవ్యాఖ్యాన సహితం...ఆయనే అభినవ వేదవ్యాస మహర్షిగా లబ్ద ప్రతిష్టులైన పౌరాణిక సార్వభౌమ మల్లాది చంద్ర శేఖర శాస్త్రి. మల్లాది ప్రముఖ పండితులు, పురాణ ప్రవచకులు. ఆయన స్వరంలోని మాధుర్యం, రామాయణ, భారత, భాగవతాలపై ఆయనకున్న పట్టు కారణంగా పురాణ ప్రవచన ప్రముఖులలో ఆయన ప్రత్యేకతను సంతరించు కున్నారు. తన పదిహేనవ ఏట నుంచి ప్రారంభించిన ఈ ప్రవచన యజ్ఞం అసిధారావ్రతంగా కొనసాగుతునే ఉంది. సహస్ర చంద్ర దర్శనం చేసుకున్నా, శత జయంతి వేడుకల సమయాన్ని సమీపిస్తున్నా, జీరవోని గొంతుతో, ఉపన్యాసం, హరికథ, నాటకం, పురాణం కలిపి శ్రోతలను ఆకట్టుకునే విధంగా చేస్తున్న ప్రవచనాలు ఆయన అసమాన ప్రతిభకు నిదర్శనాలు. మల్లాది దక్షిణామూర్తి దంపతులకు 1925 ఆగస్టు 22న భాద్రపద శుక్ల తృతీయ నాడు అర్ధరాత్రి, అంటే తెల్లవారితే వినాయక చవితి అనగా సనాతన సత్సంప్రదాయం గల కుటుంబంలో ఆయన జన్మించారు. తాతగారు మల్లాది రామకృష్ణ విద్వత్ చయనుల వద్ద పెరిగిన క్రమంలో, నాయనమ్మ కృష్ణవేణి సోమిదమ్మ సాకగా, తాతగారే ఉపనయన సంస్కారం చేశారు. ఆయన వద్దనే తర్క ప్రకరణాలు, శ్రౌతస్మార్తాలు అభ్యసించారు. ఆయన పితృదేవులు దక్షిణామూర్తి శాస్త్రి పుష్పగిరి ఆస్థాన పండితులు. ఆర్షసంప్రదాయాన్ని ఆయన వద్దనే అలవరచు కున్నారు. పెత్తండ్రి వీరరాఘవ శాస్త్రి తర్కవేదాంత పండితులు. పినతండ్రి హరిశంకర శాస్త్రి తెనాలిలో వేదవిద్యా పరీక్షాధికారిగా పని చేసేవారు. పినతండ్రి వద్దే వేదాధ్యయనం గావించి, కంభంపాటి రామ్మూర్తి శాస్త్రి వద్ద పూర్వ మీమాంస, వ్యాకరణం నేర్చుకున్నారు. తెలుగు మాత్రం వీధిబడిలో చదువు కున్నారు. తాతగారికి, మనమడు పురాణ ప్రవచనం చెప్పాలని కోరిక. ఆంగ్ల విద్య అభ్యసిస్తే, ఉద్యోగం చేస్తానంటారని ఎలాంటి పరీక్షలు రాయ నివ్వకుండా తాత జాగ్రత్త పడ్డారు. అయితే శాస్త్రికి పురాణాలు చెప్పడం ఇష్టం ఉండేది కాదు. అది గ్రహించిన తాతగారు "చూడు నాయనా, పురాణ ప్రవచనం చెప్పాలంటే సంస్కృత వాఙ్మయం తెలిసి ఉండాలి. నిశిత పరిశీలన కావాలి. అన్వయం చెప్పగలిగి ఉండాలి. వేదాంతం, తర్కం, ఛందస్సు తెలిసుండాలి. కాబట్టి దీన్ని అంత తేలికగా తీసేయకు" అని చెప్పేవారు. పదిహేడవ యేట తాత కాలం చేశారు. ఆయన దూరమైనా ఆయన సంకల్పం మాత్రం ఎప్పుడూ చంద్రశేఖర శాస్త్రిని అంటిపెట్టుకునే ఉంది. కొంత కాలం తరువాత బెజవాడ వెళ్లి వేదాంత శాస్త్రం చదవాలనే కోరికతో అమరావతి నుంచి గుంటూరు వెళ్ళారు. బస్టాండు కొచ్చాక పరిచయస్థులు కొందరు కనిపించి "పుష్పగిరి పీఠాధిపతులు ఇప్పుడు నరసరావు పేటలో ఉన్నారు. త్వరలో ఆయన మకాం మార్చేస్తారట. ఈలోగా నువ్వొకసారి వెళ్లి ఆయన దర్శనం చేసుకోవచ్చు" అని సలహా ఇచ్చారు. దాంతో వెంటనే నరసరావు పేటకు వెళ్ళి,స్వాములవారి దర్శనం చేసుకోగానే పీఠాధిపతులు 'నువ్వు అమరావతిలో పురాణ ప్రవచనం చక్కగా చెప్పావని తెలిసింది. నాకు కూడా వినాలని ఉంది, ఇవ్వాళ ఇక్కడ పురాణం చెప్పు" అన్నారు. ఆ మాటలను ఆదేశంగా తీసుకుని ఆయన ముందు వాల్మీకి రామాయణం చెప్పారు. స్వామివారు చాలా సంతోషించి, నెలకు 40 రూపాయల గ్రాసం మీద పుష్పగిరి ఆస్థానంలో పురాణ పండితునిగా నియమించారు. ఆయనతో పాటే ఊరూరా తిరుగుతూ ఏడాదిన్నర పాటు చంద్ర శేఖర శాస్త్రి పురాణ ప్రవచనం చెప్పారు. తర్వాత పెత్తండ్రి మల్లాది వీరరాఘవశాస్త్రి బెజవాడలో బ్రహ్మ సత్రయాగం జరుపుతుంటే ఆయన కోరిక మేరకు అక్కడ సుమారు సంవత్సరం పాటు ప్రవచనం చేశారు. ఆయన ఇరవై అయిదవ ఏట సీతారామ ప్రసన్నతో వివాహం జరిగింది. సరిగ్గా ఏడాది తర్వాత అంటే 1951లో ఆయనకు కొడుకు పుట్టాక తాతపై గల గౌరవంతో, జ్ఞాపకార్థం రామకృష్ణ అని పేరుపెట్టు కున్నారు. దివంగత ప్రధాని పాముల పర్తి నరసింహారావు, దివంగత ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, వంటి రాజకీయ ప్రముఖులతో పాటు చిత్తూరు వి.నాగయ్య, ఘంటసాల, ఎస్వీరంగారావు, కన్నాంబ వంటి వెండితెర నటీ నటులు ఆయన ప్రవచనాలను ఎంతో ఇష్టపడేవారు. ఒక సందర్భంలో చిత్తూరు నాగయ్య ఇంటికి పిలిచి భోజన వస్త్రాలతో సత్కరించి, చేతికి స్వర్ణకంకణం తొడగడం శాస్త్రి మరచి పోలేని జ్ఞాపకం. చాలామంది సినిమాలలో నటించమని అడిగితే ఇష్టం లేక తిరస్కరించారు. ఆయన ప్రవచనం చెబుతుండగా శ్రోతలు వింటున్నట్లుగా ఉండే దృశ్యాన్ని చిత్రీకరించాలని కొందరు దర్శకులు ప్రయత్నాలు చేసినా, ఎందుకనో అది కూడా వీలు పడక పోవడం యాదృచ్ఛికం.వందలాది రామాయణ, మహాభారత, భాగవత ప్రవచనాలూ నిర్వహించడమే కాకుండా, ప్రతియేటా ఉగాది నాడు పంచాంగ శ్రవణం చేసేవారు. దూరదర్శన్‌లో, సప్తగిరి చానల్‌లో ప్రవచనాలు కొనసాగించే ప్రయత్నం చేశారు. వయసు మీద పడుతుండడంతో, శారీరిక శక్తి సన్నగిల్లి, ప్రయాణాలు చేయ లేకుండా ఉన్న కారణంగా 2011 జనవరి నుంచి పురాణ ప్రవచనాలు చెప్పడం క్రమంగా తగ్గించారు. శ్రీవేంకటేశ్వర భక్తిచానల్, సప్తగిరి చానల్ వారు తమ చానల్‌లో ప్రవచనం చెప్పవలసిందే అని పట్టుబట్టడంతో తమ ఇలవేల్పు పట్ల ఉన్న భక్తి, గౌరవం మేరకు వారిని కాదనలేక పోయారు. శోకరసమైతే దుఖంలో దుఃఖ సాగరంలో, హర్ష దాయకమైతే ఆనందంతో మమేకమై పరవశించి పోయే ఆయన ప్రవచనంలో లీనమయ్యే తీరు దశాబ్దాల ప్రవచన కాలంలో శ్రోతల, ప్రేక్షక జన బాహుళ్యానికి సన్నిహితంగా ఉంచింది. మల్లాది చంద్రశేఖరశాస్త్రి సుదీర్ఘ పురాణ ప్రవచన ప్రస్థానంలో ఎందరో ప్రముఖులు, ప్రముఖ సంస్థలతో లెక్కలేనన్ని సన్మానాలు, సత్కారాలు, బిరుదులు పొందారు. అందులో ప్రముఖంగా తిరుమల తిరుపతి దేవస్థానాలలో శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో స్వామి వారి కల్యాణ వ్యాఖ్యాతగా అభినవ వ్యాస బిరుదును పొందారు. శృంగేరి పీఠాధిపతి చంద్రశేఖర స్వామి ఆశీర్వచనంతో సవ్యసాచి బిరుదును, భీముని పట్నం సద్గురు శివానందమూర్తి నెలకొల్పిన సనాతన ధర్మట్రస్ట్ ద్వారా ఎమినెంట్ సిటిజన్ అవార్డును అందుకోవడమే కాక మాజీ ప్రధాని పి.వి నరసింహారావుతో సత్కారం అందుకున్నారు. 2005లో ప్రతిష్ఠాత్మక రాజా-లక్ష్మీ అవార్డు ద్వారా వచ్చిన లక్ష రూపాయల నగదును సనాతన ధర్మట్రస్టుకు విరాళమిచ్చారు. పురాణ ప్రవచన సాంప్రదాయం కొనసాగాలనే తపనతో, ఎందరో శిష్యులను తమ ఆశయానికి అనుగుణంగా తీర్చిదిద్దిన పరమ భాగవతోత్తములు చంద్రశేఖర శాస్త్రి.. 96 ఏళ్ళ వయసులో 14, 2022న వయోభారంతో పాంచభౌతిక కాయాన్ని వదిలి శివైక్యం చెందారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# నైజాం విముఖత.. 'పోలో'తో విలీనం



- నేడు హైదరాబాద్‌పై సైనిక చర్య ప్రారంభమైన రోజు
- భారత యూనియన్‌లో చేరేందుకు నిరాకరించిన ఏడో నిజాం
- రజాకార్ల ఆగడాలతో అట్టుడికిన హైదరాబాద్ సంస్థానం
- 1948 సెప్టెంబర్ 13న మొదలైన 'ఆపరేషన్ పోలో'
- సెప్టెంబర్ 17న భారత యూనియన్‌లో హైదరాబాద్ విలీనం

**దేశానికి స్వాతంత్ర్యం వచ్చే నాటికి దేశవ్యాప్తంగా 565 సంస్థానాలు ఉండేవి. బ్రిటీష్ పాలకులు స్వాతంత్ర్యం ఇస్తూనే... సంస్థానాలు ఇండియాలో కలవాలో లేదో నిర్ణయించుకునే అవకాశం సదరు పాలకులకే ఇచ్చారు. ఫలితంగా... మూడు సంస్థానాలు ఇండియాలో కలవలేదు. అవి కాశ్మీర్, జునాఘడ్, హైదరాబాద్ (నైజాం). ఆ పరిస్థితుల్లో ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్... ప్రత్యేక శ్రద్ధ పెట్టి... జునాఘడ్ సంస్థానాన్ని భారత్‌లో కలిసేలా చేశారు. నైజాం నవాబ్ మాత్రం విలీనానికి ఒప్పుకోలేదు. అప్పట్లో రాజాకార్ల పేరుతో ప్రత్యేక సైన్యాన్ని తయారుచేసిన ఖాసిం రజ్వీ... మారణ కాండకు తెగబడ్డారు. స్వాతంత్ర్యం వచ్చాక దాదాపు 13 నెలలపాటూ... తెలంగాణ ప్రజలు చూడని నరకం లేదు. కనీసం తినడానికి తిండి, తాగడానికి నీళ్లు కూడా లేకుండా చేశారు.**





పొట్ట కూటికోసం వర్తక వ్యాపారాలకై వచ్చిన శ్వేత జాతీయులు , రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యంలో సమస్త భారతావనిని అంతర్భాగం చేసుకోగా, ఎన్నో సుదీర్ఘ పోరా టాలు, ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం సాధించినా, నిజాం ఏలుబడిలో ఉన్న తెలంగాణ ప్రాంతం స్వతంత్రం కావడానికి సంవత్సరంకు పైగా సమయం పట్టింది. 1724-1948 మధ్యకాలం 224 సంవత్సరాల పాటు 8 తెలంగాణ జిల్లాలు, 5 మరట్వాడా జిల్లాలు, 3 కర్ణాటక జిల్లాలతో కలిపి 16 జిల్లాల హైదరాబాద్ రాష్ట్రం మూడు భాషలతో కొనసాగింది. హైదరాబాద్ సంస్థానాధీశుడు ఏడవ నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ పరిపాలనా చివరి అంకంలో ఖాసిం రజ్వీ నేతృత్వంలో రజాకార్ల దళాల దురాగతాలు సహించరాని వైనాయి. ఉద్యమ కారులను గురి చేసిన క్రూరాతిక్రూర అమానుష చిత్రహింసలకు హద్దులు లేకుండా పోయాయి. 90 రకాల పన్నుల విధింపే కాకుండా తమ పలుకు బడిలోని ప్రజలను బానిసలుగా చూస్తూ , వెట్టి చాకిరీలు చేయించు కున్నారు . ప్రజల సొమ్ముతో జల్సాలు చేసు కున్నారు. ఎదిరిస్తే కాల్చి చంపారు. మత మార్పిడులు బలవంతంగా చేశారు. తెలుగు వారి సంస్కృతి సంప్రదాయలను అణచి వేశారు. స్థానీయ భాషలను, అనాదిగా ఉన్న సంప్రదాయాలను హీనంగా చూశారంటే తెలుగు వారి దుర్గతి స్పష్టమవుతుంది. స్వామి రామానంద తీర్థ నాయకత్వంలో ఆర్యసమాజ్, కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో సాయుధ పోరాటాలు, కవులు, రచయితలు తమతమ పాత్రలు నిర్వహించి, నిజాం పాలనకు వ్యతిరేకంగా ప్రజా చైతన్యానికి కృషి సల్పారు. నల్గొండలో పురుడు పోసుకున్న నిజాం వ్యతిరేక పోరాటం రాజ్యం అంతటా విస్తరించింది. రావి నారాయణ రెడ్డి, చంద్ర రాజేశ్వరరావు , మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలా దేవి, బొమ్మగాని ధర్మభిక్షం, మాడపాటి హన్మంతరావు , సురవరం ప్రతాపరెడ్డి, కాళోజీ నారాయణరావు, దాశరథి, షోయబుల్లా ఖాన్, అనభేరి ప్రభాకర్ రావు, జమలాపురం కేశవరావు, లక్ష్మీనర్సయ్య, బద్దం ఎల్లారెడ్డి, మగ్దూం మొహియుద్దీన్, దొడ్డి కొమురయ్య, కోదాడ నారాయణరావు , బెల్లం నాగయ్య, సింగిరెడ్డి భూపతిరెడ్డి, రాంజీగోండు, కొమురం భీం, రఘునాథరావు కాచే , అలుగు వీరమ్మ, కిషన్ మోదాని, లక్క కిష్టయ్య, బత్తిని మొగిలయ్య, కాటం లక్ష్మీ నారాయణ, మర్రి చెన్నారెడ్డి, వందేమాతరం రాంచందర్ రావు , కర్నె వెంకట కేశవులు ఒక్కరేమిటి... వివిధ పోరాట మార్గాలలో, ఎందరో త్యాగధనులు తమతమ పాత్రలను పోషించి, ప్రాణాలను ఫణంగా పెట్టారు. నారాయణరావు పవార్, శంశా బాద్ గంగారామ్ తో కలిసి ఏకంగా నిజాం పైనే బాంబులు విసిరి సంచలనం సృష్టించారు. దాశరథి కారాగారంలో గోడలపై నిజాం వ్యతిరేక కవితలు రాశారు. కాళోజి, సుద్దాల హనుమంతు, యాదగిరి లక్ష్మీనారాయణ లాంటి వారు జన బాహుళ్య కవితలల్లారు. ఇలా నిజాం వ్యతిరేక పోరాటాలు వివిధ రూపాల్లో ఉద్ధృతం అయిన వేళ . . .రజాకార్ల ఆగడాలు, భారత ప్రభుత్వానికి, నిజాంకు మధ్య జరిగిన అన్ని చర్చలూ విఫలమయ్యాయి. భారత దేశంలో విలీనానికి నిజాం అంగీకరించలేదు. రజాకార్ల ఆగడాలు మితిమీరి పోయాయి. మరోవైపు కమ్యూనిస్టుల సాయుధ పోరాటం సాగుతోంది. హైదరాబాద్ ప్రత్యేక రాష్ట్రంగా నైనా , లేక పాకిస్తాన్లో అంతర్భాగంగా నైనా ఉండాలని నిజాం ప్రయత్నిస్తూ, ఐక్య రాజ్య సమితికి నిజాం, భారతదేశంపై ఫిర్యాదు చేయడానికి దూతలను సైతం పంపాడు. పోరాటానికి దేశాల నుండి ఆయుధ సంపత్తిని పొందే కృషి సల్పారు.

1946 - 1948ల మధ్య హైదరాబాదు రాజ్యంలో నెలకొన్న పరిస్థితులు అత్యంత ఉద్రిక్తమైనవి. హైదరాబాదుకు స్వతంత్ర ప్రతిపత్తి కావాలని ఆశిస్తూ, దాన్ని ప్రత్యేక దేశంగా గుర్తించాలని నిజాం ప్రతిపాదించాడు. ఇత్తెహాదుల్ ముస్లిమీన్ సైనిక విభాగమైన రజాకార్ల కు చెందిన ఖాసిం రజ్వీ రంగంలోకి దిగడం దానివల్లనే జరిగింది.

**యథాతథ స్థితికి ఒప్పందం...**

వాస్తవ పరిస్థితిని నిజాం రాజుకు అర్థమయ్యేలా చెప్పడానికి కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఫలించి, 1947 నవంబర్ 29న యథాతథ స్థితి ఒప్పందం కుదిరింది. 1947 ఆగష్టు 15కు పూర్వపు పరిస్థితికి ఒక సంవత్సరం పాటు కట్టుబడి ఉండాలనేది ఈ ఒప్పంద సారాంశం. నవాబు స్వయంగా ఢిల్లీకి వెళ్లి సర్దార్ పటేల్‌ను కలిసి, 1947 నవంబర్ 29వ యథాతథ ఒప్పందంపై మౌంట్‌బాటన్ నిజాం నవాబు సంతకాలు చేశారు. ఒప్పందంలో భాగంగా హైదరాబాదులో భారత్ తరపున ఏజంట్ జనరల్‌గా కె.ఎం.మున్షీ నియమితుడయ్యాడు.

అయినా నైజాం, ఆయన నియమిత సైన్యం ఆగడాలు ఆగలేదు. ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది. ఆదివాసీలు ఏకమై ఎదురు తిరిగారు. ఎంతో మంది ఉద్యమ నేతలు, కళాకారులు... అందరూ తమ ప్రాణాలు ఫణంగా పెట్టారు. ఉద్యమం అత్యంత తీవ్ర స్థితికి చేరిన స్థితిలో, కేంద్ర ప్రభుత్వం నిజాం సంస్థాన్ని ఇండియాలో కలిపేయమని సర్దార్ వల్లభాయ్ పటేల్‌కి సూచించగా, ఈ క్రమంలోనే "ఆపరేషన్ పోలో," పేరుతో నాటి భారత హోం మంత్రి, ఉక్కు మనిషి సర్దార్ పటేల్ నేతృత్వంలో " పోలీసు చర్య" చేపట్టడం జరిగింది. జనరల్ జె. ఎన్. చౌదరి నాయకత్వంలో 1948 సెప్టెంబర్ 13 న సైనిక చర్య ప్రారంభమైంది. భారత సైన్యం విడివడి విజయవాడ, బీదర్ వైపుల నుండి నలు వైపులా ముట్టడికి ముందుకు సాగాయి. ఓటమిని తప్పించుకో లేని నిజాం, దిక్కు తోచక, లేక్ వ్యూ అతిథి గృహంలో ఉన్న భారత ఏజెంట్ మున్షీని కలిసి, లొంగు బాటు నిర్ణయాన్ని ప్రకటించాడు. బొల్లారం వద్ద నిజాం, సర్దార్ పటేల్ ముందు తలవంచి, లొంగి పోవడంతో, సైనిక చర్య సెప్టెంబర్ 17 న సఫలీకృతమైంది. తద్వారా హైదరాబాద్ రాజ్యం, భారత యూనియన్లో విలీనమైంది. నిజాం ప్రధాన మంత్రి లాయక్ అలీని తొలగించి, ఖాన్ రజ్వీని ఖైదు చేశారు. తర్వాత లాయక్, రజ్వీ పాకిస్తాన్ పారి పోయారు. శాసన సభ రద్దు చేయబడి సెప్టెంబర్ 18న సైనిక చర్యను సఫలం చేసిన జే. ఎన్. చౌదరి, సైనిక గవర్నర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించారు . ఎం. కె. వెల్లోడి ముఖ్యమంత్రి గా, నియుక్తు లైనారు. 1956 ఏప్రిల్ 1న నిజాంకు , భారత ప్రభుత్వానికి ఒప్పందం కుదిరి, నిజాంకు ఏడాదికి పన్నులు లేకుండా, యాభై లక్షల రూపాయల భరణం చెల్లింపు కు, ప్రపంచంలో నిజాం ఎక్కడికి వెళ్ళినా హైదరాబాద్ పూర్వపు రాజుగా బిరుదులు కొనసాగింప బడేందుకు, ప్రభుత్వం అంగీకరించింది. అలా 1956 అక్టోబర్ 31 వరకు నిజాం రాజ్ ప్రముఖ్ గా కొనసాగారు.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494





# హైదరాబాద్ రంజీ జట్టు కెప్టెన్‌గా సిరాజ్

రంజీ ట్రోఫీ కొత్త సీజన్‌కు హైదరాబాద్ జట్టు కొత్త ఉత్సాహంతో సిద్ధమవుతోంది. భారత స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్‌కు జట్టు పగ్గాలు అప్పగించింది హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ). 2026-27 సీజన్‌లో హైదరాబాద్‌కు సిరాజ్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. చామా మిలింద్‌ను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు. అక్టోబర్ 11 నుంచి రంజీ ట్రోఫీ ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్‌లో త్రిపురతో హైదరాబాద్ తలపడనుంది. హైదరాబాద్ ఎలైట్ గ్రూప్-బిలో ఉంది. సౌరాష్ట్ర, కర్ణాటక, పంజాబ్, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, అసోం, త్రిపుర ఈ గ్రూపులో ఉన్నాయి. ఇటీవల శ్రీలంక పర్యటనలో సిరాజ్ ఆశించిన స్థాయిలో వేగం చూపలేకపోయాడు. సాధారణంగా గంటకు 140 కిలోమీటర్లకు పైగా వేగంతో బంతులు వేసే అతడు.. అక్కడ 120 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేశాడు. రెండు మ్యాచ్‌ల్లో 44 ఓవర్లు వేసి నాలుగు వికెట్లు తీసుకున్నాడు. రెండు నెలల విరామం తర్వాత నేరుగా మ్యాచ్ ఆడటంతో తన బౌలింగ్ లయ దెబ్బతిన్నట్లు సిరాజ్ తెలిపాడు. రన్‌అప్‌లో అడుగులు సరిగ్గా పడకపోవడంతో వేగం తగ్గిందని చెప్పాడు. దులీప్ ట్రోఫీ ఫైనల్లో మాత్రం సిరాజ్ తిరిగి లయ అందుకున్నాడు. శ్రీలంక నుంచి వచ్చిన కొన్నిరోజులకే చెన్నై మ్యాచ్ ఆడినా.. దేశం తరఫున ఆడేటప్పుడు సాకులు చెప్పకూడదని స్పష్టం చేశాడు. జట్టు కోసం పూర్తి స్థాయిలో కష్టపడటమే తనకు ముఖ్యమని చెప్పాడు. ఇప్పుడు హైదరాబాద్ కెప్టెన్‌గా సిరాజ్ ముందు మరో సవాలు ఉంది. నాయకత్వంతో పాటు బంతితోనూ సత్తా చాటేందుకు అతడికి రంజీ సీజన్ మంచి అవకాశం కానుంది.

# నేడు ఆఫ్ఘనిస్తాన్ తో టీమిండియా టీ20

- ఢిల్లీ అరుణ్ జైట్లీ స్టేడియం మ్యాచ్
- సవాల్‌గా మారిన తుది జట్టు ఎంపిక






శ్రేయాస్ అయ్యర్ సారథ్యంలోని భారత టీ20 జట్టు ఇటీవలే జింబాబ్వే పర్యటనను దిగ్విజయంగా ముగించుకుంది. ఈ సిరీస్ ను 3-0 తేడాతో కైవసం చేసుకుంది. అంతకుముందు ఐర్లాండ్, ఇంగ్లాండ్ లల్లో చవి చూసిన పరిపూర్ణ ఓటముల గాయాన్ని జింబాబ్వే సిరీస్ కొంతవరకు నయం చేయగలిగింది. ఇక.. మూడు టీ20 మ్యాచ్ ల సిరీస్ ఆడబోతోంది. ఆఫ్ఘనిస్తాన్ తో తలపడబోతోంది. ఈ మూడు మ్యాచ్ లకు ఢిల్లీ అరుణ్ జైట్లీ స్టేడియం ఆతిథ్యాన్ని ఇస్తోంది. అన్ని మ్యాచ్‌లు రాత్రి 7:30 గంటలకు ప్రారంభమౌతాయి. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో బరిలోకి దిగుతున్న టీమిండియా.. జింబాబ్వేపై సాధించిన విజయ పరంపరను కొనసాగించాలనే పట్టుదలతో ఉంది. తుది జట్టును ఎంపిక చేయడం పెద్ద సవా వాల్‌గా మారింది. స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ జట్టులోకి తిరిగి రావడంతో ఈక్వేషన్లు మారాయి. జింబాబ్వే పర్యటనకు దూరమైన శాంసన్ ఇప్పటివరకు ఆడిన 14 మ్యాచ్‌ల్లో 180.99 స్ట్రైక్ రేట్‌తో ఏకంగా 400 పరుగులు సాధించాడు. ఇందులో మూడు అర్ధ సెంచరీలు ఉన్నాయి. టీమిండియా ఓపెనింగ్ స్థానం కోసం గట్టి పోటీ నెలకొంది. జింబాబ్వే సిరీస్‌లో వరుసగా రెండు హాఫ్ సెంచరీలు సాధించి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అందుకున్న వైభవ్ సూర్యవంశీ వైపే మేనేజ్‌మెంట్ మొగ్గు చూపే అవకాశం ఉంది. మరో ఓపెనర్ అభిషేక్ శర్మ ప్రస్తుత ఫామ్ ఆందోళన కలిగిస్తోంది. గత మూడు మ్యాచ్‌ల్లో అతను కేవలం 11 పరుగులు మాత్రమే చేశాడు. మొదటి మ్యాచ్‌లో అభిషేక్ రాణించకపోతే, మిగిలిన రెండింటికీ సంజూ శాంసన్‌ను ఓపెనర్‌గా పంపే అవకాశం ఉంది. వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ కూడా ఓపెనర్ రేసులో ఉన్నాడు. దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్‌పై 270 పరుగుల రికార్డు ఇన్నింగ్స్‌తో ఇషాన్ తన ఫామ్‌ను నిరూపించుకున్నాడు. దీంతో అతను నాలుగో స్థానంలో ఆడే అవకాశాలు ఉన్నాయి. ఇక మిడిల్ ఆర్డర్‌లో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, వైస్ కెప్టెన్ తిలక్ వర్మ జట్టుకు వెన్నెముకగా నిలవనున్నారు. ఆల్‌రౌండర్ కోటాలో ఎవరిని ఎంపిక చేయాలనే దానిపై తర్జన భర్జన జరుగుతోంది. శివమ్ దూబే, నితీష్ కుమార్ రెడ్డిల్లో ఒకరికి అవకాశం దక్కొచ్చు. ఎవరిని ఆడిస్తారనేది పిచ్ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. బ్యాటింగ్ డెప్త్ పెంచాలనుకుంటే దూబే వైపు, బౌలింగ్ ఆప్షన్ వైపు మొగ్గు చూపితే నితీష్ రెడ్డిని ఎంపిక చేసే అవకాశం ఉంది. బౌలింగ్ విభాగంలో మేనేజ్‌మెంట్ జస్ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్‌పై దృష్టి సారించింది. అర్ష్‌దీప్ సింగ్, స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ ఈ మ్యాచ్ లో కీలకం కానున్నారు.

# చెన్నై యాజమాన్యం క్లారిటీతో తెరపడిన ఉత్కంఠ




చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీలో ధోనీ వాటాలు కోరారనే ప్రచారం క్రీడా వర్గాల్లో పెద్ద ఎత్తున కలకలం రేపింది. ఈ ఊహాగానాలపై సీఎస్కే యాజమాన్యం అధికారికంగా స్పందిస్తూ స్పష్టత ఇచ్చింది. అదే సమయంలో కొత్త కోచ్ ఎంపిక, రాబోయే ఐపీఎల్ వ్యూహాలపై కూడా కీలక సమాచారం వెలువడింది. చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీలో వాటాలను కొనుగోలు చేయడానికి ధోనీ ఆసక్తి చూపించారని, అయితే ఆయన పెట్టిన షరతులకు యాజమాన్యం అంగీకరించలేదని కొన్ని వార్తలు హల్‌చల్ చేశాయి. ఈ ప్రచారంపై సీఎస్కే పెద్ద అధికారి ఒకరు తీవ్రంగా స్పందించారు. ధోనీ నుంచి అలాంటి ప్రతిపాదన ఏది తమ వద్దకు రాలేదని, ఆయనతో దీనిపై ఎలాంటి చర్చలు జరగలేదని స్పష్టం చేశారు. ఎన్ శ్రీనివాసన్‌తో ఆయన వ్యక్తిగతంగా మాట్లాడారో లేదో తమకు తెలియదని వివరించారు. గతంలో సీఎస్కే షేర్లు ప్రైవేట్ విక్రయానికి అందుబాటులో ఉన్న సమయంలో ధోనీ కొన్ని షేర్లను కొనుగోలు చేసిన మాట నిజమేనని ఫ్రాంచైజీ వర్గాలు వెల్లడించాయి. ఈ షేర్లు బహిరంగ మార్కెట్లో విక్రయించబడవు కాబట్టి ప్రైవేట్‌గానే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ధోనీ వద్ద లక్షకు పైగా షేర్లు ఉన్నప్పటికీ, మొత్తం ఫ్రాంచైజీ వాటాతో పోలిస్తే అది చాలా చిన్న భాగం మాత్రమే. ప్రస్తుతం శ్రీనివాసన్ కుటుంబం వద్దే 55 శాతానికి పైగా ప్రైవేట్ వాటాలు భద్రంగా ఉన్నాయి. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ధోనీ సెప్టెంబర్ 22 నాటికి భారత్‌కు తిరిగి రానున్నారు. ఆయన స్వదేశానికి చేరుకున్న వెంటనే ఐపీఎల్ 2027 వేలానికి సంబంధించి, అలాగే ఆటగాళ్ల ట్రేడింగ్, బదిలీలపై సీఎస్కే యాజమాన్యం ఒక కీలక సమావేశం నిర్వహించనుంది. ప్రధానంగా సీఎస్కే కొత్త హెడ్ కోచ్ ఎంపికలో ధోనీ పాత్ర అత్యంత కీలకం కానుంది. ఒక విదేశీ దిగ్గజ ఆటగాడిని కోచ్‌గా నియమించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. అభిమానుల్లో ఎన్నో సందేహాలు ఉన్నప్పటికీ ధోనీ, సీఎస్కే బంధం ఎప్పటిలాగే బలంగా ఉంది. సెప్టెంబర్ చివరి వారంలో జరగబోయే సీఎస్కే సమావేశం తర్వాత కొత్త కోచ్ ఎవరనే దానిపై పూర్తి స్పష్టత రానుంది.

# 309 ఇన్నింగ్స్‌ల్లో 69వ అర్ధశతకం

### చరిత్ర సృష్టించిన ఇంగ్లాండ్ కెప్టెన్ రూట్

రెడ్ బాల్ క్రికెట్‌లో ఇంగ్లాండ్ రన్‌మెషీన్ జో రూట్ తన సూపర్ ఫామ్ కొనసాగిస్తూ సరికొత్త చరిత్ర సృష్టించాడు. టెస్టు క్రికెట్ చరిత్రలోనే అత్యధిక అర్ధశతకాలు సాధించిన బ్యాటర్‌గా టీమిండియా క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న ఆల్‌టైమ్ వరల్డ్ రికార్డును రూట్ బద్దలు కొట్టాడు. ఎడ్జ్‌బాస్టన్‌లో పాకిస్థాన్‌తో జరిగిన మూడో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో హాఫ్ సెంచరీ బాదడం ద్వారా రూట్ తన కెరీర్‌లో 69వ టెస్టు ఫిఫ్టీని నమోదు చేసుకున్నాడు. సచిన్ టెండూల్కర్ 329 ఇన్నింగ్స్‌ల్లో 68 ఫిఫ్టీలు సాధించగా, రూట్ కేవలం 309 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ మార్కును దాటేశాడు. ఈ ఇన్నింగ్స్‌తో జో రూట్ మరో భారీ మైలురాయిని చేరుకున్నాడు. ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో 1000 ప్లస్ టెస్టు పరుగులు పూర్తి చేసిన తొలి బ్యాటర్‌గా చరిత్ర పుటలకెక్కాడు. ఒకే వేదికపై నిలకడగా పరుగులు రాబడుతూ ప్రత్యర్థి బౌలర్లకు సింహస్వప్నంగా మారిన రూట్, ఈ మైదానంలో ఇంగ్లాండ్‌కు అనేక చారిత్రాత్మక విజయాలను అందించడంలో కీలక పాత్ర పోషించాడు. నాలుగు వేర్వేరు క్రికెట్ వేదికల్లో 1000 కంటే ఎక్కువ టెస్టు పరుగులు సాధించిన ప్రపంచంలోనే మూడో క్రికెటర్‌గా జో రూట్ నిలిచాడు. గతంలో లార్డ్స్ (2203 రన్స్), మాంచెస్టర్ (1128 రన్స్), ది ఓవల్ (1050 రన్స్) మైదానాల్లో వెయ్యికి పైగా పరుగులు చేసిన రూట్, ఇప్పుడు ఎడ్జ్‌బాస్టన్ (1000ం రన్స్)ను కూడా ఆ జాబితాలో చేర్చాడు. క్రికెట్ చరిత్రలో దక్షిణాఫ్రికా దిగ్గజం జాక్వెస్ కల్లిస్, ఆస్ట్రేలియా గ్రేట్ రికీ పాంటింగ్ మాత్రమే ఈ ఘనత సాధించగా, ఇప్పుడు రూట్ వారి సరసన నిలిచాడు.కాగా పాకిస్థాన్‌తో జరిగిన మూడో టెస్టులో ఇంగ్లాండ్.. 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. దీంతో మూడు టెస్టుల సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేసింది. ఇక ఇంగ్లాండ్, పాకిస్థాన్ టెస్ట్ సిరీస్‌లో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా ఇంగ్లాండ్‌కు చెందిన ఓలీ రాబిన్సన్, పాక్ పేసర్ మహమ్మద్ అబ్బాస్ నిలిచారు.





# ఇంగ్లాండ్ గడ్డపై పాక్‌కు ఘోర పరాభవం..

### మూడో టెస్టులోనూ పాకిస్థాన్‌కు ఓటమి

ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగిన మూడో టెస్టులో ఇంగ్లాండ్ జట్టు 8 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. ఈ విజయంతో మూడు టెస్టుల సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేసి పాకిస్థాన్‌కు ఘోర పరాభవాన్ని మిగిల్చింది. కెప్టెన్‌గా జో రూట్ రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన తర్వాత తొలి సిరీస్‌నే క్లీన్ స్వీప్ చేయడం గమనార్హం. తొలి రెండు టెస్టులతో పోలిస్తే.. మూడో టెస్టులో పాక్ కాస్త పోరాడినా ఓటమిని మాత్రం తప్పించుకోలేకపోయింది. దీంతో నాలుగు రోజుల్లోనే టెస్ట్ మ్యాచ్ ముగిసింది. 130 పరుగుల స్వల్ప లక్ష్యంతో నాలుగో రోజు ఆట ప్రారంభించిన ఇంగ్లాండ్‌కు పాకిస్థాన్ పేసర్ మహమ్మద్ అబ్బాస్ షాక్ ఇచ్చాడు. తొలి బంతికే డకెట్‌ను డకౌట్‌గా వెనక్కి పంపిన అబ్బాస్, అదే ఓవర్లో ఎమిలియో గేని కూడా పెవిలియన్ చేర్చాడు. కేవలం 2 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన ఇంగ్లాండ్‌పై పాక్ పైచేయి సాధించినట్లు కనిపించింది. అబ్బాస్ తన కట్టుదిట్టమైన స్పెల్‌తో ఇంగ్లాండ్ బ్యాటర్లను ఒత్తిడిలోకి నెట్టాడు.అయితే కెప్టెన్ జో రూట్, జోర్డాన్ కాక్స్ కలిసి ఇంగ్లాండ్‌ను ఆదుకున్నారు. పాకిస్థాన్ బౌలర్ల దాడిని తట్టుకుంటూ నెమ్మదిగా స్కోరు బోర్డును ముందుకు నడిపారు. ఈ క్రమంలో పాకిస్థాన్ చేసిన పొరపాట్లు రూట్‌కు బాగా కలసివచ్చాయి. మహమ్మద్ అలీ బౌలింగ్‌లో రూట్ బంతిని వికెట్లపైకి ఆడుకున్నప్పటికీ అది నో-బాల్ కావడంతో బ్రతికిపోయాడు. ఆ తర్వాత స్లిప్‌లో క్యాచ్ డ్రాప్ అవ్వడంతో లభించిన అవకాశాలను రూట్ పూర్తిగా సద్వినియోగం చేసుకుని అజేయ హాఫ్ సెంచరీతో జట్టును గెలిపించాడు. ఒత్తిడిని జయించిన జో రూట్, జోర్డాన్ కాక్స్ మూడో వికెట్‌కు 100కు పైగా పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. కాక్స్ కూడా తన అర్ధశతకాన్ని పూర్తి చేసుకుని ఇంగ్లాండ్ విజయాన్ని ఖరారు చేశాడు. చివరికి 24.2 ఓవర్లలో 130/2 పరుగులు చేసిన ఇంగ్లాండ్ సునాయాస విజయాన్ని అందుకుంది. ఈ ఓటమితో పాకిస్థాన్ ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ అవకాశాలు గల్లంతయ్యాయి.ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ 133 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం ఇంగ్లాండ్ 453 పరుగులు చేసింది. అయితే రెండో ఇన్నింగ్స్‌లో పాక్ బ్యాటర్లు పోరాడారు. దీంతో ఈ సిరీస్‌లోనే తొలిసారి ఆ జట్టు స్కోరు 200 పరుగుల మార్కును దాటింది. చివరకు 449 పరుగులకు ఆ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో ఆలౌట్ అయింది. అనంతరం 130 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్.. 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి.. సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేసింది.

# బుమ్రాను ఎదుర్కొనేందుకు మా వద్ద వ్యూహాలు ఉన్నాయి

### ధీమా వ్యక్తం చేసిన ఆఫ్ఘనిస్థాన్ కెప్టెన్ ఇబ్రహీం జద్రాన్

గాయం నుంచి కోలుకుని తిరిగి జట్టులోకి వస్తున్న టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాను ఎదుర్కోవడానికి తమ వద్ద ప్రత్యేక వ్యూహాలున్నాయని ఆఫ్ఘనిస్థాన్ కెప్టెన్ ఇబ్రహీం జద్రాన్ ధీమా వ్యక్తం చేశాడు. ఆదివారం (సెప్టెంబరు 13) అరుణ్ జైట్లీ స్టేడియంలో జరగనున్న తొలి టీ20కి ముందు జద్రాన్ మీడియాతో మాట్లాడాడు. బుమ్రా రాకతో భారత బౌలింగ్ విభాగం పటిష్ఠంగా మారినప్పటికీ, అతడిని సమర్థంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశాడు. "జస్ప్రీత్ బుమ్రా ప్రపంచంలోని అత్యుత్తమ బౌలర్లలో ఒకడు. నాకు ఇష్టమైన ఫాస్ట్ బౌలర్ కూడా అతడే. అయితే మేం ఏ విషయాన్నీ క్లిష్టంగా మార్చుకోం. అతడి కోసం మా వద్ద మంచి ప్రణాళిక ఉంది. అతడి బౌలింగ్‌ను ఎలా ఎదుర్కోవాలనే దానిపై స్పష్టమైన అవగాహనతో ఉన్నాం. బుమ్రాతో పాటు భారత జట్టుపైనా మెరుగైన ప్రదర్శన చేస్తామని ఆశిస్తున్నాం" అని జద్రాన్ తెలిపాడు. టీమిండియా యువ సంచలనం, లెఫ్ట్ హ్యాండ్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీపై కూడా ప్రత్యేకంగా దృష్టి సారించామని జద్రాన్ వెల్లడించాడు. "ఐపీఎల్‌లో అతడిని ఎదుర్కొన్న మా జట్టు ఆటగాళ్ల నుంచి కీలక సమాచారం సేకరించాం. ఇప్పటికే అతడి వీడియోలను విశ్లేషించాం. సరైన సమయంలో సరైన ప్రణాళికలను అమలు చేయడంపైనే మా దృష్టి ఉంది" అని వివరించాడు. భారత్‌లో ఆడటం తమకు కొత్తేమీ కాదని, ఇక్కడి పరిస్థితులపై సంపూర్ణ అవగాహన ఉందని జద్రాన్ అన్నాడు. "గతంలో టీ20 ప్రపంచకప్, వన్డే ప్రపంచకప్‌లతో పాటు ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడాం. 2024లో బెంగళూరులో జరిగిన టీ20లో రెండు సూపర్ ఓవర్ల వరకు మ్యాచ్ సాగింది. భారత్‌పై మేం ఎప్పుడూ మెరుగైన క్రికెట్ ఆడాం. అయితే ఇప్పటివరకు వారిపై సిరీస్ గెలవలేదు. ఈసారి ఆ రికార్డును బద్దలు కొట్టి సిరీస్ గెలవడమే మా లక్ష్యం" అని పేర్కొన్నాడు. రషీద్ ఖాన్ నుంచి టీ20 కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించడంపై మాట్లాడుతూ, తమ మధ్య మంచి అవగాహన ఉందని, ఇది జట్టుకు మేలు చేస్తుందని తెలిపాడు. కొత్త కోచ్ రిచర్డ్ పైబస్ మార్గదర్శకత్వంలో జట్టు మరింత మెరుగవుతోందని, గతంలో తాము బలహీనంగా ఉన్న అంశాలపై దృష్టి సారించి మెరుగుపరుచుకుంటున్నామని వివరించాడు. భారత గడ్డపై వారికే ఆతిథ్యమివ్వడం తమ క్రికెట్ చరిత్రలో ఒక అపూర్వ ఘట్టం అని జద్రాన్ అభివర్ణించాడు. కెప్టెన్‌గా ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలి, సరైన సమయంలో సరైన నిర్ణయాలు ఎలా తీసుకోవాలనే దానిపై దృష్టి పెడుతున్నానని, ఈ కొత్త బాధ్యతను ఆస్వాదిస్తున్నానని అన్నాడు.

# స్పిరిట్‌ను ఆపే దమ్ముందా?..



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'స్పిరిట్' విడుదలకు ముందే చర్చల్లో నిలిచింది. సినిమా నిర్మాతల్లో ఒకరైన ప్రణయ్ రెడ్డి వంగా సినీ విమర్శకులను ఉద్దేశించి చేసిన ఘాటు వ్యాఖ్యలు ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారాయి. తమ చిత్రాన్ని సమీక్షలతో దెబ్బతీయాలని ప్రయత్నించాలని, అందులో ఎంత సత్తా ఉందో చూద్దామంటూ ఆయన సవాల్ విసిరారు. ఇటీవల ఆయన నిర్మాణంలో వచ్చిన 'రోమాంచకం' చిత్రానికి మిశ్రమ స్పందన వచ్చిన నేపథ్యంలో ప్రణయ్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. సినిమా తెరకెక్కించడం వెనుక దర్శకుడు, చిత్ర బృందం పడే కష్టం తెలియకుండానే విమర్శకులు సులభంగా సమీక్షలు


## విమర్శకులకు నిర్మాత సవాల్

రాస్తున్నారని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒక సినిమా నిర్మాణంలోకి వస్తేనే దర్శకుడు కథను తెరపైకి తీసుకురావడానికి ఎదుర్కొనే సమస్యలు, ఒత్తిడి, శ్రమ ఏ స్థాయిలో ఉంటాయో అర్థమవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 'స్పిరిట్' ప్రస్తావన తీసుకొచ్చిన ప్రణయ్ రెడ్డి.. సినిమా విడుదలైన తర్వాత తమ సమీక్షలతో చిత్రాన్ని దెబ్బతీయాలని ప్రయత్నించండి చూద్దామంటూ విమర్శకులకు ఘాటుగా సవాల్ విసిరారు. ఆయన వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో సినీ వర్గాల్లో దీనిపై చర్చ జరుగుతోంది. 'స్పిరిట్' విషయానికొస్తే.. ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా కలయికలో వస్తున్న తొలి చిత్రమిది. ఇంటెన్స్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ప్రభాస్ శక్తిమంతమైన పోలీసు అధికారి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. 'యానిమల్' ఫేమ్ తృప్తి డిమ్రీ కథానాయికగా నటిస్తుండగా.. బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ కీలక పాత్రలో కనిపించనున్నారు. మరోవైపు 'స్పిరిట్' విడుదల తేదీపై ఇటీవల పలు వార్తలు వచ్చాయి. సల్మాన్ ఖాన్ చిత్రంతో పోటీని నివారించేందుకు 2027 ఈద్ నుంచి సినిమా వాయిదా పడుతుందనే ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తలను చిత్ర నిర్మాణ సంస్థ టీ-సిరీస్ ఖండించింది. విడుదల తేదీలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేసింది. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే చిత్రీకరణ కొనసాగుతోందని, 2027 మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా 'స్పిరిట్'ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు తెలిపింది.

# నవ్విస్తూనే ఉత్కంఠ పెంచిన 'ఆదర్శ కుటుంబం' టీజర్..



విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా విడుదలైన టీజర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఆద్యంతం వినోదాత్మకంగా సాగిన టీజర్‌లో త్రివిక్రమ్ మార్క్ సంభాషణలు, వెంకటేశ్ కామెడీ టైమింగ్ ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. సరికొత్త లుక్‌లో కనిపించి న వెంకటేశ్ తనదైన శైలిలో నవ్వులు పూయిం చారు. డబ్బు, కుటుంబ అప్పులు, వంటింటి సంభాషణల నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు మధ్యతరగతి కుటుంబ జీవనాన్ని వినోదాత్మకంగా ఆవిష్కరించాయి. అయితే కుటుంబమంతా 'ఏకే 47' పేరున్న డ్యూప్లెక్స్ ఇంట్లోకి మారిన తర్వాత కథ ఊహించని మలుపు తిరుగుతుంది. ఓ క్రైమ్ సంఘటన, విలన్ ప్రవేశంతో టీజర్ ఒక్కసారిగా సీరియస్‌గా మారుతుంది. దీంతో 'ఆదర్శ కుటుంబం' కేవలం కుటుంబ కథాంశంతో రూపొందిన చిత్రం కాదని, వినోదంతో పాటు ఉత్కంఠకు ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. కుటుంబ అనుబంధాలు, హాస్యం, భావోద్వేగాలు, నేర నేపథ్యాన్ని మేళవిస్తూ త్రివిక్రమ్ ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు టీజర్ ద్వారా స్పష్టమవుతోంది. వెంకటేశ్‌కు జోడీగా 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి నటిస్తుండగా.. నారా రోహిత్, దివ్యేందు శర్మ, నివేదా పేతురాజ్, రావు రమేశ్, వెన్నెల కిశోర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. తమన్ అందించిన నేపథ్య సంగీతం టీజర్‌లోని సన్నివేశాలకు మరింత బలాన్ని చేకూర్చింది. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది. టీజర్‌కు వస్తున్న స్పందనతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.



## 'స్వయంభూ' కోసం 175 రోజుల షూట్..

యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ నటిస్తున్న పాన్ ఇండియా పీరియాడిక్ చిత్రం 'స్వయంభూ'పై అంచనాలు పెరుగుతున్నాయి. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం ఏకంగా 175 రోజుల పాటు చిత్రీకరణ జరిపినట్లు నిఖిల్ తెలిపారు. సినిమాలో 2500 గ్రాఫిక్స్ షాట్లు ఉన్నాయని, త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని వెల్లడించారు. 'స్వయంభూ'లో నిఖిల్ యోధుడి పాత్రలో కనిపించనున్నారు. పాత్ర కోసం వియత్నాంలో ప్రత్యేక మార్షల్ ఆర్ట్స్ శిక్షణ తీసుకుని రెండు చేతులతో కత్తి యుద్ధం చేయడంలో ప్రావీణ్యం సంపాదించారు. హీరోయిన్ సంయుక్త కూడా యాక్షన్ సన్నివేశాల కోసం ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నారు. మారేడుమిల్లిలో చిత్రీకరించిన ఓ సన్నివేశంలో ఆమె ప్రమాదకరమైన స్టంట్ చేసినట్లు దర్శకుడు గతంలో వెల్లడించారు. హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో దాదాపు 60 రోజుల పాటు భారీ క్లైమాక్స్‌ను చిత్రీకరించారు. భారతీయ సాంస్కృతిక వారసత్వం, ఓ యోధుడి గాథ ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని పిక్సెల్ స్టూడియోస్ పతాకంపై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్నారు. భారీ సాంకేతిక హంగులతో రూపొందుతున్న 'స్వయంభూ' విడుదల కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు





## ది ప్యారడైజ్'కు ట్రైలర్ ఉండదు: నాని

నేచురల్ స్టార్ నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్'కు ట్రైలర్ విడుదల చేయడం లేదని నాని స్పష్టం చేశారు. సెప్టెంబరు 24న సినిమా విడుదల కానున్న నేపథ్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రైలర్ కోసం నాలుగైదు రోజులు కేటాయిస్తే సినిమా చివరి దశ పనులపై ప్రభావం పడుతుందని, ప్రస్తుతం చిత్రాన్ని పూర్తి చేయడమే తమకు ముఖ్యమని చెప్పారు. 'ది ప్యారడైజ్' కోసం తన సినీ ప్రయాణంలోనే అత్యంత కష్టపడ్డానని నాని తెలిపారు. తల్లీ కొడుకుల బంధం చుట్టూ కథ సాగుతుందని, హింసతో పాటు బలమైన భావోద్వేగాలు ఉంటాయని చెప్పారు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల పట్టుదల, సినిమాపై ఉన్న ప్రేమ తనకు ఎంతో గర్వంగా అనిపిస్తాయని ప్రశంసించారు. సినిమా నిడివి 2 గంటల 49 నిమిషాలు ఉంటుందని శ్రీకాంత్ ఓదెల వెల్లడించారు. షూటింగ్ సమయంలో పలువురికి గాయాలయ్యాయని నాని తెలిపారు. మోహన్‌బాబుతో కలిసి పనిచేయడం మంచి అనుభవమని చెప్పారు. సినిమాకు ప్రీమియర్లు ఉంటాయని నిర్మాత సుధాకర్ చెరుకూరి వెల్లడించగా.. టికెట్ ధరల పెంపుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు.

అనన్య నాగళ్ల ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ది బ్రేకింగ్ న్యూస్'. పవన్ కడియాల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో సీనియర్ నటుడు మురళీమోహన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ప్రస్తుతం సినిమా చిత్రీకరణ శరవేగంగా సాగుతోంది.

## 'ది బ్రేకింగ్ న్యూస్' ట్రైలర్‌కు ముహూర్తం ఫిక్స్

ఈ నేపథ్యంలో చిత్ర ట్రైలర్ విడుదల తేదీని అనన్య నాగళ్ల ప్రకటించారు. సెప్టెంబరు 18న సాయంత్రం 6 గంటలకు ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపారు. బలమైన కథాంశం, ఆకట్టుకునే దృశ్యాలతో ట్రైలర్ ఉండబోతుందని పేర్కొన్నారు. అంతేకాకుండా ట్రైలర్‌తో పాటు ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే మరో కీలక ప్రకటన కూడా అదే రోజు వెలువడుతుందని హింట్ ఇచ్చారు. దీంతో 'ది బ్రేకింగ్ న్యూస్'పై ఆసక్తి మరింత పెరిగింది.

Printed, Published and Owned by V SAMPATH, and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146 Email: shenarthimedia@gmail.com. Phone No: 9391343644